నేటి నిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com
E-mail : netinijam93@gmail.com
హైదరాబాద్ | బుధవారం 24-6-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2011 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 283 | పేజీలు:4 | వెల: రూ.1/-

## టెర్రరిస్టులను పంపి కల్లోలం సృష్టించే యత్నాలు

### వరుస ఘటనల వెనక పాక్ కుట్రలు
### వెల్లడించిన డీజీపీ దిల్‌బాగ్ సింగ్

శ్రీనగర్,జూన్23(ఆర్ఎన్ఎ): టెర్రరిస్టులను పంపి కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ-కాశ్మీర్‌లో దాడులు చేయడానికి పాక్ కుట్ర పన్నుంతోందని డీజీపీ దిల్‌బాగ్ సింగ్ వెల్లడించారు. జమ్మూ-కాశ్మీర్‌లోని అనేక ప్రాంతాల ద్వారా ఈ తీవ్రవాదులు దేశంలోకి ప్రవేశించే అవకాశం ఉందని, భద్రతా దళాలపై దాడులే లక్ష్యంగా వీరు దేశంలోకి చొరబడుతున్నారని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా నౌషెరీ, రాజౌరి-పూంచ్, కుప్వరా-కెరాన్ సెక్టార్ల ద్వారా అనేకమంది జైషే మహ్మద్, లష్కర్ తాయిబా టెర్రరిస్టులు దేశంలో ప్రవేశించనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే సరిహద్దులోని దళాలకు సమాచారం అందించామని, వారంతా సమన్వయంతో పనిచేస్తున్నారని దిల్‌బాగ్ సింగ్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మంగళవారం ఉదయం కూడా పూల్వామా ప్రాంతంలో టెర్రరిస్టులకు, సైన్యానికి మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో జవాన్ సునీల్ కాలే వీరమరణం పొందారు. కాల్పుల్లో ఇద్దరు తీవ్రవాదులు కూడా హతమయ్యారు. అయితే జవాను మృతికి ప్రతీకారంగా శ్రీనగర్ సరిహద్దుల్లోని ఓ తీవ్రవాదుల రహస్య స్థావరాన్ని సైన్యం పేల్చేసింది. ఈ నేపథ్యంలో మరింత మంది తీవ్రవాదులు కాశ్మీర్‌లోని ప్రవేశించనున్నారంటూ డీజీపీ దిల్‌బాగ్ సింగ్ పేర్కొనడం ప్రాధాన్యం సంతరించుకుంది.



సిరిసిల్లలో అధునాతన రైతుబజార్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కెటిఆర్

# సిరిసిల్లలో వేగంగా అభివృద్ధి పనులు

### ఇతర జిల్లాలకన్నా మెరుగైన కార్యక్రమాలు
### అధునాతన రైతు బజార్‌ను ప్రారంభించిన మంత్రి కెటిఆర్

రాజన్న సిరిసిల్ల,జూన్23(నేటినిజం ప్రతినిధి): ఇతర జిల్లాలకు ఆదర్శవంతంగా సిరిసిల్లలో అభివృద్ధి జరుగుతున్నదని మంత్రి కెటిఆర్ అన్నారు. రోహిణి కార్తెలో కూడా చెరువులు నింపడం సీఎం కేసీఆర్ పనితనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను మూడేండ్లలో పూర్తి చేయడం సీఎం కేసీఆర్ పనితీరుకు అద్దం పడుతుందన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఐటీ, పురపాకల శాఖ మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థానలు, ప్రారంభోత్సవాలు చేసారు. రూ.5.15కోట్ల తో సిరిసిల్ల పట్టణంలో అధునాతన రైతు బజార్ ను మంత్రి ప్రారంభించారు. అనంతరం మార్కెట్ లో రైతులు, వ్యాపారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాలంతో పోటీపడి కాళేశ్వరం ప్రాజెక్ట్ పూర్తి చేసుకున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు రైతుబంధు, రైతుబీమా అందజేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. సంక్షోభంలోనూ ఒక్క రోజులోనే 50 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ అయ్యాయని తెలిపారు. ఈ ఏడాది రూ. 25 వేల లోపు రుణమాఫీ ఒకసారి అమలు చేశామని వెల్లడించారు. వ్యవసాయ రంగానికి మహర్దశ పట్టనుందని, విదేశాలకు చేపలు, రొయ్యలు ఎగుమతి చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. రైతును రాజును చేయడమే ప్రభుత్వ సంకల్పమన్నారు. వ్యాపారులు మార్కెట్ లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు.

## శ్యాంప్రసాద్ ముఖర్జీకి యోగి నివాళి

లక్నో,జూన్23(ఆర్ఎన్ఎ): భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జి వర్ధంతి సందర్భంగా మంగళవారం లక్నోలోని సివిల్ దవాఖానలోని ఆయన విగ్రహానికి ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం దవాఖాన మొత్తం తిరిగి రికార్డులు పరిశీలించి, రోగులతో మాట్లాడి సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అంతకు ముందు ప్రధాని నరేంద్ర మోడి, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, బీజేపీ జాతియ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్టీ సీనియర్ నేతలు, తదితరులు శ్యాం ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పించారు. శ్యాం ప్రసాద్ ముఖర్జి (1901-1953) సీనియర్ రాజకీయ నాయకుడు, బారిస్టర్, విద్యావేత్త. ఆయన భారతీయ జన సంఘ్‌కు ఫౌండర్‌గా ఉన్నారు. ఈయన జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు కేంద్ర పరిశ్రమలు, సరఫరాల శాఖ మంత్రిగా పనిచేశారు. అయినప్పటికీ నెహ్రూతో విభిన్న అభిప్రాయాల నేపథ్యంలో ఆయన జనతా పార్టీని స్థాపించారు. అదే బీజేపీగా మారింది.

# కరోనాపై బిజెపి చిల్లర రాజకీయాలు

### కేంద్రం వైఫల్యం వల్లనే కరోనా వ్యాప్తి
### బిజెపి తీరుపై మండిపడ్డ మంత్రి తలసాని

హైదరాబాద్,జూన్23(ఆర్ఎన్ఎ): కరోనా విషయంలో బీజేపీ నాయకులు రాష్ట్రంలో చిల్లర రాజకీయాలు చేస్తున్నారని పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బీజేపీ నేతల వ్యాఖ్యలపై మంత్రి స్పందిస్తూ... కేంద్రం వైఫల్యం వల్లనే దేశంలో కరోనా వ్యాపించిందన్నారు. కేంద్రం సడలింపు లిచ్చి.. నెపం రాష్ట్రాల మీద నెడుతోందన్నారు. మర్కజ్ కేసులను తాము అలర్ట్ చేసే వరకు కేంద్రానికి తెలియకపోవడం శోచనీయమని అన్నారు. కేంద్రం ప్రకటించిన రూ. 20 లక్షల కోట్ల ప్యాకేజీ ఎక్కడ అమలయిందో చూపించాలని ప్రశ్నించారు. ఆస్పత్రుల దగ్గర ధర్నాలు చేయడం బీజేపీ బాధ్యతారాహిత్యం అన్నారు. కరోనాపై పోరాటంలో కేంద్రం రాష్ట్రానికి చేస్తున్న సాయం లేమీ లేదన్నారు. ఐసీఎంఆర్ నిబంధనల ప్రకారమే కరోనా టెస్టులు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కరోనా కట్టడికి ప్రభుత్వం చేయాల్సిందంతా చేస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కరోనాలాంటి వ్యాధులు రాకుండా ఉండాలంటే పర్యావరణ పరిరక్షణ కూడ తప్పనిసరి అన్నారు. మంగళవారం అసెంబ్లీ మీడియాపాయింట్ వద్ద ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ముఠాగోపాల్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు.

హైదరాబాద్ జనాభా కోటిపైనే ఉంది. పాజిటివ్ కేసులు పెరిగినంత మాత్రాన ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎవరు ఈ కేసులతో మరిణిస్తున్నారో మీడియా వివరాలు తెప్పించుకోవాలని సూచించారు. కరోనాకు ఎవరూ అతీతులు కాదన్నారు. కరోనా బారిన పడిన వారు చాలా మంది కోలుకుంటున్నారని మంత్రి తెలిపారు. బీజేపీ నేతలకు పబ్లిసిటీపిచ్చి పట్టుకుంది. అందుకే పనికి మాలిన ఆలోపణ లుచేస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈసమయంలో ఆస్పత్రుల వద్ద ధర్నాలు చేయడం చిల్లర రాజకీయమని దుయ్యబట్టారు. తెలంగాణలో కరోనా కట్టడి చర్యలను కేంద్ర బృందం, వైద్య శాఖ మంత్రి ప్రశంసించారని అన్నారు. ఢిల్లీలో మర్కజ్ సందర్భంగా కరోనా ప్రబలితే కేంద్ర ఇంటిలిజెన్స్ ఏం చేసిందని ఆయన ప్రశ్నించారు. వలస కార్మికులను ఇబ్బందికి గురి చేసింది ఎవరు? అంటూ ప్రశ్నించారు. ఐసిఎంఆర్‌గైడ్‌లైన్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం పాటిస్తోందని, ప్రతి పక్షాలకు ఏ అంశాన్ని ఎత్తుకోవాలో తెలలియడం లేదన్నారు. లాక్‌డౌన్ ప్రకటించడం, ఎత్తేయడం కేంద్రం ఇష్టానుసారంగా చేసిందని తలసాని విమర్శించారు. ఈనెల 25న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. 150 డివిజన్లలో ఆగస్టు15వ తేదీ వరకూ ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. హరితహారాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరికీ మొక్కలను ఉచితంగా అందిస్తామన్నారు. కరోనా మొదలైనప్పటి నుంచి దేశంలో ఏం జరిగిందన్న దానిపై మాట్లాడడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

## బెంగళూరులో లాక్ డౌన్

బెంగళూరు, జూన్ 23: కర్ణాటకలో కరోనా కేసులు పెరుగుతుండడంతో మహమ్మారి కట్టడి కోసం అక్కడి సర్కారు మరోసారి లాక్ డౌన్ విధించింది. సోమవారం నుంచి కర్ణాటక ప్రభుత్వం బెంగళూరునగరంలో ఐదు ప్రాంతాల్లో14 రోజుల పాటులాక్ డౌన్ విధించాలని నిర్ణయించింది. మంత్రులు, అధికారులతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి యడియూరప్ప ఈ నిర్ణయం తీసుకున్నారు. రెండు నెలల లాక్డౌన్ తర్వాత సడలింపును ప్రజలు దుర్వినియోగం చేయడంపై యడియూరప్ప అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతర్రాష్ట్ర ప్రయాణికులతో పాటు, లాక్ డౌన్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై పోలీసు కేసులు నమోదు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. జూన్ 22 న కర్ణాటకలో కొత్తగా 249 కోవిడ్-19 కేసులు నమోదు కాగా... ఐదుగురు మృతి చెందారు. రాష్ట్రంలో మొత్తం ఇప్పటివరకు 9,399 కోవిడ్ కేసులుండగా , మరణాల సంఖ్య 142 కు చేరుకున్నది. సోమవారం చనిపోయిన ఐదుగురిలో ముగ్గురు బెంగళూరు పట్టణానికి చెందినవారే. కర్ణాటక రాజధాని బెంగళూంలోనే కొత్తగా 126 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కలబురగి -27, విజయపుర -15, ఉడిపి -14, దక్షిణా కన్నడ -12, దవంగెరే -9 వంటి ప్రాంతాల్లోనే అత్యధికంగా కేసులు నమోదవుతున్నాయి. అందుకోసమే ఆయా ప్రాంతాల్లో లాక్ డౌన్ అమలు చేసేందుకు కర్ణాటక సర్కారు సిద్ధమైంది.

# అనుకున్నంత పని చేసిన ట్రంప్

### విదేశీ వర్కర్లకు ఇచ్చే వీసాలను రద్దు చేస్తూ ప్రకటన
### అనేక కంపెనీలపై తీవ్ర ప్రభావం ఉంటుందని ఆందోళన

వాషింగ్టన్,జూన్23(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుకున్నంత పని చేశాడు. తాను అనుకున్న విధంగానే వీసాలు రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు విదేశీ వర్కర్లకు ఇచ్చే వీసాలను అమెరికా ప్రభుత్వం రద్దు చేసింది. అధ్యక్షుడు ట్రంప్ దీనిపై ప్రకటన చేశారు. వీసాల రద్దు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తమ దేశానికి వలస వచ్చే వారిని రాకుండా అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. వీసాలతో వచ్చే వారికి బ్రేక్ పడిన్నట్లైంది. ఈ నెల 24 నుంచి డిసెంబర్ 31 వరకు తాజా ఉత్తర్వులు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. జూన్ 24 నుంచి అమెరికాలో లేని వారికి ఈ ఆదేశాలు వర్తిస్తాయని అధికారులు తెలిపారు. విదేశాల నుంచి వచ్చి పని చేసే వారితో అమెరికన్లకు ఉద్యోగాలు లేకుండా పోతున్నాయి. ఇది అక్కడ సమస్యగా మారుతోంది. దీంతో వారిని రాకుండా సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఓ వైపు అక్కడ కరోనా కూడా కల్లోలం సృష్టిస్తోంది. కొత్త చిక్కులు తెచ్చుకోవడం దేనికని ముందు ఈ చర్యలకు ఉపక్రమించారు. దీంతో అమెరికా వెళ్లి ఉద్యోగాలు చేయాలని అనుకునే వారికి తాత్కాలికంగా ఆంక్షలు తప్పడం లేదు. కాగా ఈ ఏడాది ప్రారంభం నుంచి ఏప్రిల్ వరకు అక్కడ వివిధ పరిశ్రలమల్లో 1.7 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఈ ఉద్యోగాలను నాన్-ఇమ్మిగ్రాంట్ వీసాలు, ఇతర వీసాల వర్కర్లతో భర్తీ చెయ్యాలని కంపెనీల యజమానులు భావిస్తున్నారు. ఈ సమయంలో ట్రంప్ తీసుకున్న నిర్ణయం ఆసక్తిగా మారింది. కాగా, మొదటి నుంచి ట్రంప్ అమెరికా ఫస్ట్ అనే నినాదంతో ముందుకు సాగుతున్న సంగతి తెలిసిందే. దీని వల్ల భారత టెక్కీలపై ఎక్కువ ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో వీసాల రద్దు ప్రభావం సుమారు 5,25000 మందిపై పడనున్నది. వీసాలు కోల్పోతున్నవారిలో ఎక్కువ శాతం హై స్కిల్డ్ టెక్నికల్ వర్కర్లు, నాన్ అగ్రికల్చరల్ సీజనల్ హెల్పర్లు, టాప్ ఎగ్జిక్యూటివ్‌లు ఉన్నారు. ఈ ఏడాది మొత్తం కొత్త వీసాల జారీ ఉండదని ట్రంప్ తెలిపారు. కొత్తగా గ్రీన్‌కార్డులు జారీ చేయాలనుకున్న లక్షా 70 వేల మందిపైన కూడా ప్రభావం చూపనున్నది. గ్రీన్‌కార్డు ఉన్న విదేశీయులు పర్మనెంట్ రెసిడెంట్స్ అవుతారు. ఆ వెయిటింగ్ లిస్టులో ఉన్న 170000 మందికి ఇదో షాక్ వార్తే. ఏప్రిల్ నెలలో జారీ చేసిన ఆదేశాలను ఈ ఏడాది చివర వరకు పొడగించనున్నట్లు అమెరికా ప్రభుత్వం వెల్లడించింది. కొత్త ఆదేశాల ప్రభావం ప్రస్తుతం వీసా ఉన్నవారిపై పడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇమ్మిగ్రేషన్ గ్రీన్‌కార్డులను సస్పెండ్ చేయడం వల్ల భారతీయ హెచ్1బీ టెకీ వీసాదారులపై ప్రభావం పడుతుంది. సిలికాన్ వ్యాలీ కంపెనీలు తక్కువ జీతం తీసుకునే ఉద్యోగులకు హెచ్1బీ వీసాలు జారీ చేశాయని విమర్శకులు అంటున్నారు. గత ఏడాది సుమారు 225000 మంది హెచ్1బీ వీసాలకు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 85 వేల స్పాట్స్ అందుబాటులో ఉండగా.. 2.25 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు చెప్పారు. ఇక సీజనల్ వర్కర్లకు ఇచ్చే హెచ్-2బీ వీసాలను దాదాపు పూర్తిగా రద్దు చేశారు. స్వల్ప వ్యవధి కోసం ఇచ్చే జే-1 వీసాలను కూడా హోల్డ్‌లో పెట్టేశారు. ఈ వీసాల వల్ల విదేశీ విద్యార్థులపై ప్రభావం పడుతుంది. ప్రొఫెసర్లు, స్కాలర్స్‌కు మాత్రం దీని నుంచి మినహాయింపు కల్పించారు. బహుళజాతి కంపెనీల్లో మేనేజర్లకు ఇచ్చే ఎల్ వీసాలను కూడా రద్దు చేశారు. గ్రీన్‌కార్డులు హోల్డ్‌లో పెట్టడం, విదేశీ వర్కర్లకు వీసాలు రద్దు చేయడం వంటి తాజా ఆదేశాలపై భిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని వ్యాపార వర్గాలు ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాయి. అమెరికా సివిల్ లిబర్టీ యూనియన్‌ను కూడా ట్రంప్ నిర్ణయాన్ని తప్పుపట్టింది. మహమ్మారి కమ్ముకున్న వేళ.. ఇమ్మిగ్రేషన్ విధానాన్ని మార్చేస్తున్నారని ఆ సంఘం ఆరోపించింది.

ట్రంప్ నిర్ణయంపై సుందర్ పిచాయ్ నిరుత్సాహం

హెచ్1బీ వీసాల జారీని రద్దు చేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేసిన క్రమంలో దీనిపై గూగుల్, ఆల్ఫాబెట్ సంస్థ సీఈవో సుందర్ పిచాయ్.. తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ట్విట్టర్ అకౌంట్ ద్వారా స్పందించిన ఆయన.. ట్రంప్ తీసుకున్న నిర్ణయం తనను నిరుత్సాహపరిచిందన్నారు. అమెరికా ఆర్థిక ప్రగతిలో ఇమ్మిగ్రేషన్ విధానం ఎంతో తోడ్పడిందన్నారు. ఆ కారణంగానే అమెరికా టెక్నాలజీ రంగంలో గ్లోబల్ లీడర్‌గా మారిందన్నారు. ఈ రోజు గూగుల్ కంపెనీ ఇలా ఉందంటే, అది ఇమ్మిగ్రాంట్ల వల్లే అని పిచాయ్ తెలిపారు. విదేశీ టెకీలకు వీసాలు జారీ చేయబోమని ట్రంప్ చేసిన ప్రకటన నిరుత్సాహపరిచినా.. తాము మాత్రం ఇమ్మిగ్రాంట్స్‌కు మద్దతుగా ఉంటామని, అన్ని రకాలుగా అవకాశాలు కల్పిస్తూనే ఉంటామని పిచాయ్ తన ట్విట్టర్‌లో తెలిపారు.

# కరోనాకు పతంజలి ఔషధం

### కొరోనిల్' పేరుతో మార్కెట్లోకి విడుదల

న్యూఢిల్లీ,జూన్23(ఆర్ఎన్ఎ): మొట్టమొదటిసారిగా కొవిడ్19కు ఆయుర్వేదిక్ మందును పతంజలి సంస్థ అందుబాటులోకి తీసుకుని వచ్చింది. తొలిసారిగా తామే కరోనా మందును తయారు చేశామని పతంజలి ప్రొడక్ట్స్ చైర్మన్ గురురాందేవ్ బాబా అన్నారు. ప్రపంచాన్ని వణికిస్తున్న కంటికి కనిపించని మహమ్మారికి చెక్ పెట్టేందుకు ఆయుర్వేద మందు వచ్చేసింది. ప్రముఖ దేశీయ కంపెనీ పతంజలి దీన్ని మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. 'కొరోనిల్' పేరుతో ఈ మందును ప్రముఖ యోగా గురువు రామ్‌దేవ్ బాబా మంగళవారం హరిద్వారలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆవిష్కరించారు. హరిద్వార్‌లోని పతంజలి యోగ్‌పీఠ్‌లో కరోనైల్ పేరుతో కరోనాకు ఆయుర్వేద ఔషధాన్ని విడుదల చేశారు. ఈ మందుకు అన్ని రకాల పరిశోధనలు, ప్రయోగాలు చేసినట్లు తెలిపారు. క్లీనికల్ కేస్ స్టడీ, క్లినికల్ కంట్రోల్ ట్రయల్ చేసి విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మందుతో 3 రోజుల్లో 69 శాతం రోగులు, 7 రోజుల్లో 100 శాతం మంది రోగులు కోలుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రముఖుల సమక్షంలో మందును విడుదల చేశారు. కరోనా కోసం మందు కనిపెట్టాలని ప్రపంచం మొత్తం ఎదురుచూస్తోంది. ఇవాళ మేం దానిని రుజువు చేశాం. మొదటి ఆయుర్వేదిక్ మెడిసిన్‌ను తయారు చేశాం. 100 మందిపైన క్లినికల్ ట్రయల్స్ చేశాం. మూడు రోజుల్లో దాదాపు 65 శాతం మంది కోలుకున్నారు అని రామ్‌దేవ్ బాబా అన్నారు. ఏడు రోజుల్లో 100 శాతం పేషంట్లకు జబ్బు తగ్గిపోయిందని, సమగ్రమైన రిసెర్చ్ చేసి ఈ మందును కనుగొన్నామని ఆయన అన్నారు. ఈ మెడిసిన్‌కు 100 పర్సెంట్ రికవరీ రేట్ ఉందని, జీరో శాతం డెత్ రేట్ ఉందని అన్నారు. మెడిసిన్ తయారీలో అన్ని సైంటిఫిక్ రూల్స్‌ను పాటించామని చెప్పారు. మెడిసిన్‌ను డవలప్ చేసేందుకు సైంటిస్టుల టీమ్ పనిచేస్తోందని సీఈవో ఆచార్య బాలకృష్ణ గతంలోనే ప్రకటించారు. పతంజలి రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (పీఆర్ఐ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్ జైపూర్)తో కలిసి దివ్య ఫార్మసీ ఆఫ్ ది పతంజలి దీన్ని రూపొందించినట్లు ఆయన అన్నారు. కొరోనిల్ ద్వారా 14 రోజుల్లోనే కరోనాను నయం చేయవచ్చని అన్నారు.

# అందరూ ఆనందంగా బతకాలన్నదే కెసిఆర్ ఆకాంక్ష

### అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రులు

వికారాబాద్,జూన్23(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ప్రతి ఒక్కరు చిరునవ్వుతో బతకాలన్నదే సీఎం ఆశయమని మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జిల్లాలోని బొంరాస్పేట మండలం మెట్లకుంటలో రైతు వేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేసి బీటీ రోడ్డును ఎమ్మెల్యే నరేందర్ రెడ్డితో కలిసి మంత్రులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ..రైతును రాజు చేయడంలో భాగంగా ఆదాయం తగ్గినా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కొడంగల్ కు రూ. 1.20 కోట్లతో బంజారా భవన్ నిర్మిస్తున్నారని తెలిపారు. కేటీఆర్ ఆదేశాలతో కొడంగల్ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి పాడి పశువులు ఇస్తామని మంత్రులు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పార్టీ జనరల్ సెక్రెటరీగా ఎన్నికల ప్రచారం కోసం రెండేళ్ల క్రితం ఇక్కడకు వచ్చాను. ఇక్కడ ఎక్కువ మంది గిరిజనులు ఉన్నారు. అప్పుడు ఇక్కడ వచ్చి చూస్తే తండాలలో సరైన రోడ్డు వసతి, కరెంట్ లేక అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. ఆరోజు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందడం లేదని తెలిసింది. ఆరోజు మేము చెప్పింది నమ్మి పట్నం నరేందర్ రెడ్డిని గెలిపించడం వల్ల దాదాపు 250 కోట్ల రూపాయల నిధులు వచ్చాయనడం సంతోషంగా ఉందని మత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఉద్యమ నాయకుడు సీఎం కావడం మన అదృష్టం అన్నారు. సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ మీద ఉన్న నమ్మకంతో నరేందర్ రెడ్డిని గెలిపించడం వల్ల గతంలో ఎప్పుడు జరగనంత అభివృద్ధి జరుగుతున్నదని తెలిపారు. సిరిసిల్ల నియోజక వర్గానికి ధీటుగా దీనిని

అభివృద్ధి చేస్తామనడం ఈ నియోజక వర్గం సీఎంకున్న ప్రత్యేక శ్రద్ద కు నిదర్శనం అన్నారు. కొడంగల్ నియోజక వర్గంలో ప్రతి కుటుంబానికి వచ్చే 3 నెలల్లో పాడి పశువులు అందించాలి. దీనికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.



ప్లాస్మా థెరఫీ పేరుతో పలువురిని బురిడీ కొట్టించిన కరీం అనే వ్యక్తిని పట్టుకున్న ఢిల్లీ పోలీసులు

# ప్లాస్మా దానం పేరుతో కొత్త రకం మోసం

### -నిందితుడిని అరెస్ట్ చేసిన ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ,జూన్23(ఆర్ఎన్ఎ): ప్లాస్మా పేరుతో మోసం చేస్తున్న ఓ దుండగుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్లాస్మా కోసం ఎవరైనా సంప్రదిస్తే.. ప్రయాణ ఖర్చులకు తన ఖాతాలో పైసలు వేయమంటాడు! ఒక్కసారి ఖాతాలో పైసలు పడ్డాయంటే ఖతం అతని ఫోన్ స్విచ్ఛాఫ్ అవుతుంది! బాధితులకు మోసపోయామని గ్రహిస్తారు! ఇలా ఒక్కరు కాదు, ఇద్దరు కాదు ఎంతో మందిని అతడు మోసం చేశాడు. ఆఖరికి ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రామ్ నివాస్ గోయల్ సైతం ఈ మాయగాడి వలలో చిక్కాడు. అబ్దుల్ కరీం రానా అనే యువకుడు ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో వైద్యుడిగా, ప్లాస్మా దాతగా చెప్పుకుంటూ పలువురిని మోసం చేశాడు. తనకు ఇటీవల కరనా వచ్చి తగ్గిందని, ప్లాస్మా దానం చేస్తానని చెబుతూ.. సోషల్ మీడియాలో ప్లాస్మా దాతల కోసం వెతికే వారే లక్ష్యంగా కరీం రానా మోసాలకు పాల్పడ్డాడు. ప్రయాణ ఖర్చుల పేరుతో పలువురి నుంచి పైసలు గుంజి పత్తాలేకుండా పోయేవాడు. ఎ÷-లాస్మా చికిత్స మొదలైనప్పటి నుంచి ఇతగాడి మోసాల పరంపర కొనసాగినట్లు సమాచారం. ఇటీవల ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ రాంనివాస్ గోయల్‌ను కూడా కరీం రానా మోసం చేశాడు. తన బంధువుకు ప్లాస్మా చికిత్స చేయించడం కోసం కరీం రానాను సంప్రదించిన స్పీకర్.. అతడు రవాణా ఖర్చులకు డబ్బు వసూలు చేసి ముఖం చాటేయడంతో ఈ నెల 20న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్పీకర్ ఫిర్యాదు మేరకు నిందితుడి కోసం గాలించిన పోలీసులు ఎట్టకేలకు కరీం రానాను అరెస్ట్ చేశారు. అతను ఇంకా ఎంత మందిని ఇలా మోసం చేశాడనే వివరాలను రాబడుతున్నారు.

## చరిత్రలో నేటినిజం



కం|| అరుణిమ దునిమెడి తరుణిన
మురులను గాంచెడి సరణిన మనమున నిలువన్
శరదిందు బింబ ముఖియగు
సరసాక్షిని-నటిని-విజయ శాంతిని దలతున్!!



(జూన్ 24 విజయశాంతి జననం...)

-రాధశ్రీ
సెల్: 9494481210



వికారాబాద్ జిల్లా బొంరాస్పేట మండలం మెట్లకుంటలో రైతు వేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి కూడా ఉన్నారు.
5.లక్నోలో శ్యాంప్రాద్ ముఖర్జీ విగ్రహం వద్ద నివాళి అర్పించిన సిఎం యోగి ఆదిత్యనాథ్

నేటినిజం
బుధవారం 24-6-2020

# పర్యావరణ పరిరక్షణకు ఉద్యమించాలి

కాలుష్య నివారణకు ప్రభుత్వాలు ఇన్నేళ్లుగా తీసుకున్న చర్యల కన్నా కరోనా హెచ్చరికలతోనే సత్ఫలి తాలు వచ్చాయి. కరోనా లాక్‌డౌన్ కారణంగా కాలుష్యం తగ్గింది. నదీనదాలు స్వచ్ఛంగా కనిపించాయి. పంజాబ్,బీహార్‌ల ఉంచి హిమాలయ పర్వతసానువులు కనిపించాయి. మొత్తంగా కరోనాతో మంచి ఫలితాలు వచ్చాయి. అంటే ప్రజలు బయటకు రాకుంటే కాలుష్యం తగ్గిందన్న లెక్కలు వచ్చాయి. లాక్‌డౌన్ ఎత్తేయ డంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చేలా ఉంది. ప్రధానంగా కాలుష్య రహిత, ప్లాస్టిక్ రహిత భారత్ కోసం మనమంతా కృషి చేయాలి. కరోనా కాలంలో ఇప్పుడు ఖాళీగా ఉ ండకుండా మొక్కలు నాటడంతో పాటు, ప్లాస్టిక్ నిషేధం కోసం మనమంతా కృషి చేయాలి. పౌరులుగా మనమంతా వ్యక్తిగత బాధ్యతతో ముందుకు సాగాలి. స్వచ్ఛభారత్ అమలు చేస్తున్నా గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం అమలు కాకపోవడంతో తీవ్ర కాలుష్యం ఏర్పడుతోంది. ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను జారవిడుస్తున్నారు. దీంతో భూమిలో అది చేరి వాతావరణ కాలుష్యాన్నిపెంచుతోంది. కరోనాతో ప్లాస్టిక్ వాడకం కూడా పెరిగింది. కేన్సర్ వ్యాధి వ్యాప్తికి, వాతావరణం కాలుష్యానికి కారణమౌతున్న ప్లాస్టిక్‌పై ప్రభుత్వం నిషేధం విధించింది. భూసారాన్ని దెబ్బతీస్తున్న పాలిథిన్ వినియోగాన్ని తగ్గించాలని కోరుతున్నా అధికారులు క్షేత్రస్థాయిలో వాటి వినియోగాన్ని నియంత్రించలేక పోతున్నారు. ఇందుకు ఉద్యమతరహా మార్పు అవసరమని పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు. గ్రామాల పరిధిలో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకూ పెరిగిపోతోంది. దీనికితోడు చెత్త శుద్ధి లోపించడంతో ప్రధాన రహదారుల్లో దుర్వాసన వెదజల్లుతోంది. పట్టణ,పల్లె ప్రగతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పెద్దగా మార్పు కానరావడం లేదు. పెళ్లిళ్లు, పండుగలు, పార్టీల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లను వినియోగిస్తున్నారు. అయితే కరోనా దెబ్బకు ఈ సమస్య కూడా తగ్గిందనే చెప్పాలి. ఇప్పుడు శుభకార్యాలు లేకపోవడంతో కొంతయినా ప్లాస్టిక్ వినియోగం తగ్గిందనే చెప్పాలి. రోజువారి అవసరాల కోసం వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లను రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో గుట్టలుగా పడేసి చేతులు దులుపుకుంటున్నారు. వాతావరణాన్ని కలుషితం చేసి మన ప్రాణాలను హరిస్తున్నాయన్న విషయం గుర్తించేకపోతున్నాం. గుట్టలు గుట్టలుగా పడిఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంగా భావించి తింటున్న పశువులు, జంతువులు మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, సీసాలను తరచూ వినియో గిస్తూ కేన్సర్ వ్యాధి సోకే లక్షణాలు అధికంగా ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చిన్న పిల్లలకు కూడా సోకే అవకాశం అధిక శాతం ఉందని సూచిస్తున్నారు. వినియోగం విపరీతంగా పెరిగిపోవడంతో కాలువలు, డ్రెయిన్లు, ఖాళీ ప్రదేశాలు, డంపింగ్‌యార్డుల్లో గుట్టలు గుట్టలుగా ప్లాస్టిక్ కవర్లు పేరుకుని పోతున్నాయి. డిస్పొజల్ వస్తువుల అమ్మకాలు విపరీతంగా పెరిగినా వాటిని తగ్గించే ప్రయత్నాలు చేయడం లేదు. దీంతో పలువురు వ్యాపారస్తులు టన్నుల కొద్ది నిల్వ చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. పలువురు వ్యాపారులు షాపుల ముందు, ఆరుబయట గుట్టలుగా పేర్చి విక్రయాలు నిర్వహిస్తున్నారు. ఆఖరకు కాఫీ హోటళ్లలో కూడా ప్లేట్లలో అరటి, ఇతర ఆకులకు బదులుగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు. ఆహార పదార్థాలు ప్యాకింగ్‌కు సైతం వీటిని వాడుతున్నారు. పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై జిల్లాస్థాయిలో అధికారాలు ఇచ్చారు. అమ్మినా, కొనుగోలు చేసినా, వినియోగించినా, ఎక్కడబడితే అక్కడ వేసినా రూ.ఐదు వేల నుంచి రూ.25 వేల వరకూ జరిమానా విధిస్తారు. విక్రయ షాపులపై దాడులు చేసి వస్తువులను స్వాధీనం చేసుకోవడం, షాపులను సీజ్ చేయడం వారిపై కేసులు నమోదు చేసే అధికారం తహశీల్దార్లకు ఉంది. అయితే ముడుపులకు లొంగి చూసీచూడనట్లు వ్యవహ

రించడం పరిపాటిగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మార్కెట్‌లో పేపర్ గ్లాసులు, పేపర్ కవర్లు, ప్లేట్లు దర్శనమిస్తున్నా వాడకం ఎక్కువగా ఉంటున్నా పట్టించుకోవడం లేదు. దీనిపై మరలా అధికారులు విస్తృత ప్రచారం చేయాల్సి ఉంది. ప్లాస్టిక్ నిషేధ ఆజ్ఞలు అమల్లో ఉన్నా అమలు కావడం లేదు. అధికారుల ఉదాశీనత, వినియోగదారుల అవగాహనలేమితో విచ్చలవిడిగా వినియోగం కొనసాగుతూ నే ఉంది. దీంతో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఎక్కడ చూసినా కాలువలు, డ్రెయిన్లు వీటితో నిండి పోతున్నాయి. హరిత ఉ ద్యమంలాగే ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమంగా సాగితే తప్ప నిషేధం అమలు జరగదని అంటున్నారు. ఈ ఏడాది హరితహారంలో ప్లాస్టిక్ నిషేధంపైనా ఉద్యమించాలి. మొక్కల పెంపకం, అడవుల రక్షణపై ప్రభుత్వం పట్టుదలగా ఉంది. దేశవ్యాప్తంగా మొక్కల పెంపకాన్ని, హరిత ఉ ద్యమంగా తీసు కోవాలి. అదే సందర్భంగా ప్లాస్టిక్ నిషేధంపైనా ప్రచారం సాగాలి. ఉన్న అడవులను అయినా రక్షించు కోవాల్సిందే. ఇష్టం వచ్చినట్లుగా అడవుల నరికివేత కారణంగా లక్షలఎకరాల అడవులు నాశనం అయ్యాయి. పోడు సమస్యకారణంగా అడవులు ఉనికి లేకుండా పోతున్నాయి. అడవులను నరకడం వల్ల పర్యావరణం దెబ్బతినడమే గాకుండా సర్వత్రా విపరీత పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. అడవులను, జంతువులను కాపడుకుంటేనే మానవ మనుగడ సాధ్యం. లేకుంటే గాలీ,నీరు కూడా దక్కదు. అడవి జంతువులను కూడా కాపాడుకుంటే అడవులు కూడా పచ్చగా నిలబడతాయి. కలప స్మగ్లింగ్‌ను పూర్తిగా నిరోధించాలి. అడవుల నుంచి పూచికపుల్ల కూడా బయటికి పోకుండా చూడాలి. అడవులను నాశనం చేస్తూ, అక్రమాలకు పాల్పడు తున్న వారు ఎంతటి వారైనా ఉరితీసినా పాపం లేదు. వారివల్ల మొత్తం పర్యావరణం దెబ్బతింటోంది. అడవుల్లో ఉన్న జంతువులు నాశనం అవుతున్నాయి. పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో ఈ విషయాలను గుర్తించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పనిచేస్తేనే భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం అందగలదు. అందుకు ఇకనుంచయినా పునాది వేసుకుంటూ పోవాల్సిందే.

## మూడేండ్ల బాలిక కిడ్నాప్ కేసు

### -నాలుగు గంటల్లో ఛేదించిన పోలీసులు

హైదరాబాద్,జూన్23(ఆర్ఎన్ఎ): కలకలం సృష్టించిన మూడేండ్ల బాలిక కిడ్నాప్ కేసును బోయిన్‌పల్లి పోలీసులు నాలుగు గంటల్లో ఛేదించారు. బాలికను తల్లి ఒడికి చేర్చారు. మెదక్ జిల్లాకు చెందిన స్వరూప రెండు రోజుల క్రితం భర్తతో గొడవపడి సికింద్రాబాద్‌కు వచ్చింది. రైల్వే స్టేషన్ వద్ద కూతురితో కలిసి ఉండగా.. ఓ వ్యక్తి ఆమెను గమనించి వివరాలు తెలుసుకున్నాడు. అనంతరం ఆ వ్యక్తి మియాపూర్‌లో ఉ ంటున్న నాగమ్మకు ఈ విషయాన్ని చేరవేశాడు. వీరిద్దరూ ఎలాగైనా ఆ బాలికను కిడ్నాప్ చేయాలని పథకం వేశారు. ఆదివారం సాయంత్రం రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న స్వరూపకు మాయమాటలు చెప్పి మియాపూర్‌లో నాగమ్మ ఇంటికి తీసుకెళ్లాడు. సోమవారం ఉదయం ఇంట్లోనే టిఫిన్ చేసి, మధ్యాహ్నం బోయిన్‌పల్లి చౌరస్తాకు చేరుకున్నారు. బాలిక కిడ్నాప్‌నకు పథకం వేసిన నాగమ్మ.. తన వద్దనున్న రూ.50లను స్వరూపకు ఇచ్చి.. పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న హోటల్ నుంచి భోజనం తీసుకురమ్మని సూచించింది. స్వరూప కూతురు సరిత ఆ సమయంలో నాగమ్మ వద్దే ఉన్నది. ఇదే అవకాశంగా భావించిన నాగమ్మ.. మూడేండ్ల సరితను తీసుకొని నిజామాబాద్ బస్ డిపో బస్సు ఎక్కి వెళ్లిపోయింది. భోజనం పార్సిల్ తీసుకుని వచ్చిన స్వరూపకు నాగమ్మ, కూతురు సరిత, మరో వ్యక్తి కనిపించలేదు. కంగారుపడిన స్వరూప పక్కనే ఉన్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తొలుత పోలీస్ స్టేషన్ ముందున్న సీసీ కెమెరాలను ఎస్సై సుధాకర్‌రెడ్డి పరిశీలించగా.. ఓ మహిళ బాలికను తీసుకుని నిజామాబాద్ డిపోకు చెందిన బస్సు ఎక్కినట్లుగా గుర్తించారు. దీంతో సీఐ అంజయ్య ఆదేశాల మేరకు వెంటనే నిజామాబాద్ బస్ డిపో మేనేజర్‌కు ఫోన్ చేసి బస్సు వివరాలతో పాటు డ్రైవర్, కండక్టర్ ఫోన్ నంబర్లు సేకరించి, వారిని సంప్రదించగా.. అప్పటికే ఆ బస్సు రామాయంపేట వరకు చేరుకున్నట్లు తెలుసుకున్నారు.

## సూర్యాపేటలో కల్నల్ సంతోష్‌బాబు కాంస్య విగ్రహం

### -ప్రకటించిన మంత్రి జగదీశ్వర్ రెడ్డి

సూర్యాపేట,జూన్23(ఆర్ఎన్ఎ): సూర్యాపేట జిల్లాకేంద్రంలో కర్నల్ సంతోష్‌బాబు కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తామని, పాత బస్టాండ్ జంక్షన్‌కు ఆయన పేరు పెట్టనున్నట్లు రాష్ట్ర మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రకటించారు. సీఎం కేసీఆర్‌తో కలిసి కర్నల్ సంతోష్‌బాబు కుటుంబాన్ని పరామర్శించాక, ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు గ్రూప్‌-1 ఉద్యోగ ఉత్తర్వు, హైదరాబాద్‌లో 711గజాల ఇంటి స్థలం, రూ.5కోట్ల నగదు అందజేశారన్నారు. త్యాగధనులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఇందులో భాగంగానే కర్నల్ సంతోష్‌బాబు కుటుంబంతో పాటు యావత్ భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన అమర సైనిక కుటుంబాలకు ఆర్థిక సహాయం ప్రకటించి, ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఔదార్యాన్ని చాటుకున్నారన్నారు. అలాంటి త్యాగధనులకు సమాజం అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. తమ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చిన సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డికి కర్నల్ సంతోష్‌బాబు సతీమణి సంతోషి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాలన్ని పూర్తయిన మీదట తన ఇంటికి రావాలని సీఎం కేసీఆర్ ఆహ్వానించడంపై ధన్యవాదాలు తెలిపారు.

## అమరుల విషయంలో తెలంగాణ విధానం భేష్

### -అన్ని రాష్ట్రాలు దీన్ని ఫాలో కావాలి: సింఘ్వీ

న్యూఢిల్లీ,జూన్22(ఆర్ఎన్ఎ): కల్నల్ సంతోష్‌బాబు కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచినట్లుగానే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని కాంగ్రెస్ కోరింది. కల్నల్ సంతోష్ భార్య సంతోషికి.. 5 కోట్ల చెక్‌తో పాటు డిప్యూటీ కలెక్టర్ జాబ్ ఆఫర్ లెటర్‌ను అందజేశారు. దీని పట్ల కాంగ్రెస్ నేత, రాజ్యసభ సభ్యుడు అభిషేక్ సింఘ్వీ స్పందించారు. కల్నల్ సంతోష్ భార్య సంతోషికి తెలంగాణ సర్కార్ డిప్యూటీ కలెక్టర్ నియామక పత్రాన్ని అందజేసిందని, కేంద్ర ప్రభుత్వంతో పాటు ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇలాంటి విధానాన్ని అనుసరించాలని ఎంపీ అభిషేక్ సింఘ్వీ అభిప్రాయపడ్డారు. తన ట్విట్టర్ అకౌంట్ ద్వారా స్పందించిన ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.తెలంగాణ సీఎం కేసీఆర్.. సైనిక కుటుంబాన్ని ఆదుకున్న తీరును ఆయన ప్రశంసించారు. తెలంగాణ ఫాలో అవుతున్న విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా అనుసరించాలని సింఘ్వీ తన ట్వీట్‌లో అభిప్రాయపడ్డారు. గాల్వన్ లోయలో ఈనెల 15వ తేదీన జరిగిన సైనిక ఘర్షణలో 20 మంది భారతీయ సైనికులు వీరమరణం పొందారు. అయితే ఆ ఘర్షణల్లో తమ కమాండింగ్ ఆఫీసర్ కూడా చనిపోయినట్లు తాజాగా చైనా అంగీకరించింది. ఇవాళ జరిగిన కమాండర్ స్థాయి సమావేశంలో ఈ విషయాన్ని చైనా వెల్లడించినట్లు తెలుస్తోంది.

## వందేభారత్ విమానాలపై అమెరికా ఆంక్షలు

### -ఎయిర్ ఇండియా విమానాలకే పర్మిసన్‌పై అభ్యంతరం

న్యూఢిల్లీ,జూన్23(ఆర్ఎన్ఎ): విదేశాల్లో చిక్కుకున్న భారతీయులను తీసుకువచ్చేందుకు మోదీ సర్కార్ చేపట్టిన వందేభారత్ మిషన్ కార్యక్రమంపై అమెరికా ఆంక్షలు పెడుతోంది. మిషన్‌లో భాగంగా నడిపిన ప్రత్యేక విమానాలపై అమెరికా ప్రభుత్వం ఆంక్షలు విధించింది. భారత్ అవలంబిస్తున్న విధానాలు అనైతికంగా, వివక్షపూరితంగా ఉన్నాయన్నది. రెండు దేశాల మధ్య ఉన్న వైమానిక ఒప్పందాలను భారత్ ఉల్లంఘిస్తున్నట్లు అమెరికా ఆరోపించింది. కరోనా నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా కమర్షియల్ విమాన సేవలు రద్దు అయ్యాయి. కానీ భారతీయులను తీసుకువచ్చేందుకు ఇండియా ప్రత్యేక విమానాలను నడిపింది. కానీ అమెరికా విమానాలకు మాత్రం భారత్ వచ్చే అవకాశం ఇవ్వలేదు. కేవలం ఎయిర్ ఇండియా విమానాలు మాత్రం తిరగడం పట్ల అమెరికా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ పరిస్థితి వల్ల అమెరికా విమానాల పరిస్థితి దిగజారిపోతున్నదని ఆ దేశం ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ ఆరోపించింది. దీని గురించి త్వరలో తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పింది. అన్ని విమానాయాన సంస్థలకు అనుమతించే విషయమై భారత్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

# జంతువులకు ప్రాణసంకటంగా విద్యుత్ తీగలు

### అడవి జంతువుల రక్షణకు నడుం బిగించాలి

ఆదిలాబాద్,జూన్23(ఆర్ఎన్ఎ): అడవి జంతువుల వేట కోసం బిగించిన విద్యుత్ కంచెల కారణంగా సామాన్యులు, జంతువుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడుతున్నాయి. అడవులచుట్టూ పలు గ్రామాల్లో విద్యుత్తు తీగలతో జంతువుల వేటతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ తరహా వేటపై అటవీ, విద్యుత్తు, పోలీసు శాఖలు సమన్వయంతో దాడులు చేసి వీటిని ముందుగా నిరోధించాలి. ప్రస్తుతం కుశ్నపల్లి, నీల్వాయి రేంజ్ పరిధిలో సంచరిస్తున్న పెద్ద పులికి ముప్పు పొంచి ఉందని చెప్పవచ్చు. వాస్తవానికి అడవి పందులు, దుప్పులు జింకల కోసం ఈప్రాంత వేటగాళ్లు అడవిలో 11 కేవీ విద్యుత్తు తీగలకు వైర్లు తగిలించి వేటాడుతుంటారు. ఇలా అమర్చిన తీగలకు పశువులతో పాటు అడవులకు వెళ్లే గిరిజనులు విద్యుద్ఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురై మంచానికే పరిమితమయ్యారు. వాస్తవానికి అడవికి వంట చెరుకు కోసం ఇతర పనుల కోసం వెళ్ళే వారికి భూమిలో అమర్చిన తీగలు కనిపించక ప్రాణాలు వదులుతున్నారు. ఇలా అయిదేళ్ల వ్యవధిలో కనీసం 20 పశువులు, నలుగురు వ్యక్తులు ప్రమాదాలకు గురై బలయ్యారు. విద్యుత్తు తీగలను ప్రధాన లైనుకు తగిలించి భూమిలో కప్పిపెడుతూ అడవి లోపలివరకు తీసుకెళ్లి వదులుతారు. అడవిలో నడిచే వారికి కనిపించకుండా కాలుకు తగిలిందో ప్రాణం పోయే పరిస్థితి ఉంటుంది. దీంతో జంతువులు వేటగాళ్ల ఉచ్చులో పడుతున్నాయి. ఇలా చేయడం వల్ల అటవీ ప్రాంతంలో దుప్పిలు, జింకలు, అడవి పందులు మృగ్యం అవుతున్నాయి. పట్టపగలే గుంపులు గుంపులుగా కనిపించే జంతువులు అంతరిస్తున్నాయి. వేటగాళ్లు వీటిని మట్టుపెట్టి మాంసంతో వ్యాపారం చేస్తున్నారు. వేటగాళ్లు అమర్చే తీగలకు పెద్దపులి బలిఅయ్యే అవకాశం లేకపోలేదు. పలు మార్లు పులి సంచరిస్తునున్నట్లు అటవీ శాఖాధికారులు గుర్తించారు. పులులు వేటగాళ్ల ఉచ్చులో బలికాక ముందే చర్యలు తీసుకోవాల్సిఉంది. వేటగాళ్ల బారి నుంచి పులిని రక్షించాలంటే అటవీ జంతువుల కోసం అమర్చే తీగలను తొలగించే ప్రయత్నం జరగాలి. అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా పులులు వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్నాయి. అడవులు, వన్యప్రాణులను సంరక్షించాల్సిన క్షేత్రస్థాయి అధికారులు విధి నిర్వహణను నిర్లక్ష్యం చేస్తున్నారు. పులుల సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక నిధులు మంజూరు చేస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగా కవ్వాల్ పులుల అభయారణ్యం ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎన్ని పులులు ఉన్నాయో కూడా అధికారులకు తెలియని పరిస్థితి ఉంది. నామమాత్రంగా అక్కడక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన చేతులు దులుపుకొన్నారు. వేటగాళ్ల ఉచ్చులో నడుముకు తీగ బిగుసుకుని గాయంతో తిరుగుతున్న ఫల్గుణ పులి ఆచూకీని ఇప్పటికీ అధికారులు గుర్తించలేదు. వేటగాళ్లతో క్షేత్రస్థాయి అటవీ శాఖ అధికారులకు ఏమైన సంబంధాలు ఉ న్నాయా.. అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వన్యప్రాణులకు తరచూ వేటగాళ్ల ఉచ్చులు బిగిస్తున్న విషయం అధికారులకు తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇవన్నీ పోయి అడవుల రక్షణ సజావుగా సాగాలంటే క్షేత్రస్థాయిలో కఠిన చర్యలకు ఉపక్రమించాలి. ఇంటిదొంగల పనిపట్టాలి. అనలు సిబ్బంది క్షేత్రస్థాయిలో లేకపోవడంతోనే వారికి సమాచారం తెలియడం లేదు. అడవుల్లోనే సిబ్బంది ఉ ండి వనిచేసేలా చేయాలి. జవాబుదారీతనం తీసుకుని రావాలి. అడవుల నుంచి విలువైన టేకు,మద్దిలాంటి కలప బయటకు ఎలా వెళుతున్నదీ అందరికీ తెలుసు. రాజకీయ నాయకుల ప్రమేయం కూడా ఇందులో ఉంది. ఇలాంటి వారిని గుర్తించి కఠినంగా వ్యవహరిస్తే తప్ప సిఎం కెసిఆర్ నిర్ణయాలకు అనుగుణంగా అడవులు రక్షణ సజావుగా సాగదు.

# పందిరిసాగుతో కూరగాయ పంటలకు ప్రోత్సాహం

### కూరగాయల దిగుమతిని తగ్గించేలా చర్యలు

### రైతులకు ఆర్థిక ప్రోత్సాహం

హైదరాబాద్,జూన్23(ఆర్ఎన్ఎ): వివిద జిల్లాల్లో పందిరి పంటల సాగును ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో జిల్లా ఉద్యాన పంటల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా జిల్లాల్లో పందిరి పంటలు సాగుచేసేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పందిరిసాగుతో కూరగయాల సాగును ప్రోత్సహిస్తున్నారు. ఈ సాగుకు ముందుకు వచ్చే రైతులకు భరోసా కల్పిస్తున్నారు. కూరగాయల సగాతుట మంచి లాభాలు ఉండడంతో ఈ రకమైన పంటలను ప్రోత్సహిస్తున్నామని ఎపికి చెందిన వ్యవసాయ శాక మంత్రి కన్నబాబు వెల్లడించారు. సిద్దిపేటలో కూడా మంత్రి హరీష్ రావు రైతులను ఈ రకంగానే ప్రోత్సహిస్తున్నారు. ఎంపిక చేసిన రైతులు పందిరి పంటలను సాగు చేస్తున్నారు. పందిరి సాగుకు అవసరమైన రాతికడీలు, తీగెలు, నీటి సదుపాయం తదితర వాటి కోసం సంబంధిత శాఖ నుంచి ఆర్థిక సాయం అందచేయనున్నారు. అలాగే ఏపి పంటలను సాగు చేయాలి, వాటి సస్యరక్షణ చర్యలు, క్రిమిసంహారక మందుల వాడకాన్ని సంబంధించిన తగిన సలహాలు, సూచనల ను సైతం అధికారులు ఇవ్వనున్నారు. దీంతో అనేక మండలాల్లో కూరగాయలను, పందిరి పంటలను సాగు చేస్తున్నారు. అయితే జనాభా అవసరాలకు సరిపడే స్థాయిలో దిగుబడులు రావడంలేదు. ఇప్పటి వరకు పట్టణాలు, ఆయా గ్రామాల్లో జరుగుతున్న సంతల్లో ఎక్కువగా ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన కూరగాయలనే విక్రయిస్తున్నారు. సాగుకు అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ పెట్టుబడి ఖర్చులను దృష్టిలో ఉంచుకొని ఎక్కువ మంది రైతులు ఇతర వంటల సాగువైపు దృష్టి సారిస్తున్నారు. అలాంటి వారిని ప్రోత్సహించడానికి ఉద్యానవన శాఖ అధికారులు ముందుంటున్నారు. రైతులకు ప్రోత్సాహకాలు ప్రకటిస్తే జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగనున్నది. సరైన వర్షాలు లేక పంటల విస్తీర్ణం తగ్గుముఖం పడుతుండడంతో కూరగాయలు కొనాలంటేనే సామాన్యులు హడలిపోతున్నారు. ఇప్పటికే అన్ని రకాల కూరగాయల ధరలు పెరిగిపోయాయి. ఇందుకు ప్రధాన కారణం అవసరానికి తగినట్టుగా ఉత్పత్తులు లేకపోవడమే అని చెప్పక తప్పదు. కూరగాయల సాగు విస్తీర్ణం చాలా తక్కువగా ఉన్నట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలను దిగుమతులు చేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతున్నది. ఈ సమస్యల నుంచి గట్టెందుకు రైతులను కూరగాయల పంటలు సాగు చేసే దిశగా ప్రోత్సహించాలని సంబంధిత అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నూతన పథకానికి శ్రీకారం చుట్టింది. రైతులను కూరగాయల సాగు దిశగా అడుగులు వేయించేందుకు రాయితీలు ఇవ్వాలని నిర్ణయించింది. అందులో భాగంగా పందిరి సాగు పంటలు పండించే దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నది. పలు జిల్లాల్లో వాతావరణం పందిరి సాగు ద్వారా తీగజాతి పంటలను పండించే అవకాశం ఉంటుంది. అందులో కాకర, దొండ, చిక్కుడు, అనపకాయ, ఇతర తీగజాతి పంటలను పండించే అవకాశం ఉన్నది. రైతులు పండించే అన్ని పంటలను స్థానిక మార్కెట్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోనూ అమ్ముకునేలా అధికారులు తగిన సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. అలాగే గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. అన్ని పట్టణాలు, నగరాల్లోనూ సూపర్ మార్కెట్లు, హైపర్ మార్కెట్లు ఉన్న నేపథ్యంలో వాటికి సరఫరా చేసేలా తగిన సలహాలు, సూచనలు చేస్తున్నారు. దీంతో అన్నదాత పండించిన పంటలు మంచి ధరలకు అమ్ముకునే అవకాశం ఉంటుంది.

పందిరిసాగుతో అధిక దిగుబడి ఇప్పటి వరకు సంప్రదాయ పద్ధతిలో వ్యవసాయం చేస్తూ వస్తున్న రైతులకు పందిరి సాగు కొత్తనే చెప్పాలి. కానీ వరి, చెరుకు, పత్తి, మొక్కజొన్న పంటలను మాత్రమే సాగు చేస్తూ నష్టాలు చవిచూస్తున్న వారికి ఈ పందిరి పంటలు లాభాలు సమకూరుస్తాయనే ఆశ వ్యక్తమవుతున్నది. అలాగే నిత్యం కూరగాయలు అమ్మకం వల్ల వారికి ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని చెప్పవచ్చు. జిల్లా నుంచి మెరుగైన రవాణా సదుపాయాలు కూడా ఉండడంతో రైతులకు మరింత మేలు చేకూరనున్నది. మొత్తానికి పందిరి పంటలు రైతులకు సిరులు పండించనున్నాయి.

## మెరుగపడ్డ సత్యేంద్ర జైన్ ఆరోగ్యం

న్యూఢిల్లీ,జూన్22(ఆర్ఎన్ఎ): ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యేందర్ జైన్ ఆరోగ్యం మెరుగుపడింది. ప్లాస్మా చికిత్స చేయడంతో ఆయన ఆరోగ్యం మెరుగు పడిందని వైద్యులు తెలిపారు. ఈ నెల 17న సత్యేందర్ జైన్‌కు కరోనా పాజిటివ్‌గా తేలడంతో ఢిల్లీలోని రాజీవ్‌గాంధీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరారు. తీవ్ర జ్వరం, శ్వాససంబంధ సమస్యలతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో ఐసీయూకు తరలించి చికిత్స అందించారు. అయినా పరిస్థితి మెరుగుపడకపోవడంతో సత్యేందర్ జైన్‌కు ప్లాస్మా చికిత్స అందించారు. ఎ÷-లాస్మా చికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం మెరుగుపడింది. జ్వరం తగ్గడంతోపాటు, శ్వాసవ్యవస్థ పనితీరు మెరుగయ్యింది. దీంతో సోమవారం ఆయనను ఐసీయూ నుంచి జనరల్ వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నారు.




మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ గ్యాంగ్‌స్టర్ మూలె వినయ్‌కుమార్‌రెడ్డి అనుచరుడు మామిళ్ల పత్తయ్యగారి చిన్నరాజును అరెస్ట్ చేసి సుమారు రూ. 2లక్షలు విలువచేసే మద్యం, ఒక కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు

## యువత నిర్లక్ష్యంతోనే పెరుగుతున్న కేసులు

### గ్రేటర్ హైదరాబాద్‌లో ఆందోళనకరం

### జాగ్రత్తగా ఉండాలంటున్న నిపుణులు

హైదరాబాద్,జూన్23(ఆర్ఎన్ఎ): గ్రేటర్‌లో కరోనా విజృంభన ఆగడం లేదు.అంతకంతకూ పెరిగి.. రికార్డు స్థాయిలో పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. గ్రేటర్‌లో రోజురోజుకూ పాజిటివ్ కేసుల సంఖ్య పెరిగిపోతున్నది. ఎప్పుడు ఏ సమయంలో.. ఏ మూల నుంచి వైరస్ విరుచుకుపడుతుందో తెలియడం లేదు. దీంతో అనుమానిత లక్షణాలు ఉన్న వారు వైద్యశాలలకు పరుగులు పెడుతున్నారు. నమూనాలు ఇచ్చి మహమ్మారి సోకిందో లేదోనని నిర్ధారించ ుకుంటున్నారు. కరోనా కోరలు చాస్తున్న నేపథ్యంలో యువత మేల్కొని ప్రభుత్వ నిబంధనలు పాటించాలని హెచ్చరిస్తున్నారు దీంతో కొవిడ్ పరీక్షా కేంద్రాలకు తాకిడి పెరుగుతున్నది. ముఖ్యంగా వైరస్‌తో ఎక్కువ ప్రభావితమయ్యేందుకు అవకాశమున్నఫ్రంట్ లైన్ వారియర్స్ వైద్యులు, పోలీసులు, మీడియా ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది టెస్టులు చేయించు కుంటున్నారు. ఎవరికి వారు స్వీయరక్షణ చర్యలు తీసుకుంట ున్నారు. వైద్యులు, పోలీసులు, మీడియా సిబ్బంది సైతం వైరస్ బారినపడుతున్నారు. పాజిటివ్ కేసులు పెరుగుతుండడంతో గ్రేటర్‌లో 15 ప్రత్యేక కరోనా నిర్ధారణ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాక నిర్ధారణ పరీక్షలకు క్యూ కడుతున్నారు. ఈ సెంటర్లతో పాటు నిమ్స్, గాంధీ, ఉస్మానియా మెడికల్ కళాశాల, సీసీఎంబీ, ఈఎస్‌ఐ, నల్లకుంట ఫీవర్ దవాఖానల్లోనూ టెస్టులు చేస్తున్నారు. అయితే ఈ సెంటర్లకు వస్తున్న వారిలో ఎక్కువ శాతం ఫ్రంట్ లైన్ వారియర్స్‌యే ఉంటున్నారని అధికారులు చెబుతున్నారు. కరోనా విస్తరిస్తున్నా.. వైరస్‌తో ముందుండి పోరాడుతూ.. 24 గంటల పాటు సేవలం దిస్తున్నారు పలు శాఖల సిబ్బంది. కొవిడ్‌- 19ను కట్టడి చేయడానికి నిమ్స్, గాంధీ, ఉస్మానియా మెడికల్ కళాశాల, సీసీఎంబీ, ఈఎస్‌ఐ, నల్లకుంట ఫీవర్ దవాఖానలతో పాటు గ్రేటర్ జిల్లాల్లో 19 ప్రత్యేక కరోనా నిర్ధారణ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కరోనా నిర్ధారణ పరీక్షా కేంద్రాలకు వచ్చే వారిలో మధ్యవయసు, వృద్ధులే అధికంగా ఉంటున్నారు. యువత పరీక్షలు చేయించుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. వయస్సు పైబడుతున్న వారు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు ఏ చిన్న అనుమానం ఉన్నా..పరీక్షలు చేయించుకునేందుకు కేంద్రాలకు వస్తున్నారు. రోగులకు చికిత్స అందించే డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, హాస్పిటల్ స్టాఫ్ వైరస్‌బారిన పడితే హోం ఐసొలేషన్ తప్పదు. దీని వల్ల సిబ్బంది కొరత ఏర్పడే ప్రమాదమున్నది. యువత ఇష్టారాజ్యంగా రోడ్లపై సంచరిస్తుం డటంతో అదే స్థాయిలో కరోనా సైతం విస్తరిస్తున్నది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన కేసుల్లో యువతనే ముందు వరుసలో ఉండడమే ఇందుకు నిదర్శనం. ఇందులో మొదటి స్థానంలో 26 నుంచి 30 ఏండ్ల వయస్సు వారు ఉ ండగా, రెండో స్థానంలో 31-35 ఏండ్ల వయస్సువారు ఉన్నారు.

## మిషన్ కాకతీయతో మెరుగైన ఫలితాలు

### -హరితహారం లక్ష్యాలను పూర్తి చేస్తాం: జోగు

ఆదిలాబాద్,జూన్23(ఆర్ఎన్ఎ): మిషన్ కాకతీయలో మంజూరైన చెరువు పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే జోగు రామన్న వెల్లడించారు. అలాగే హరితహారం లక్ష్యం చేరుకునేలా కార్యాచరణ చేస్తున్నామని అన్నారు. వానాకాలంలోపు పూర్తి చేయాలనే లక్ష్యంగా వేగం పెంచామన్నారు. చెరువు పనులు పూర్తయితే వేలాదిఎకరాలకు సాగునీరందించే అవకాశం ఉంటుందని నీటిపారుదల శాఖ అధికారులు అంటున్నారు. చెరువు పునరుద్ధరణ పనుల్లో భాగంగా కట్ట బలోపేతం, మట్టితీయడం, ఇరిగేషన్ కెనాల్‌లను నిర్మించాల్సి ఉంటుం ది. ఇందులో ప్రస్తుతం మట్టికట్ట ఎత్తుపెంచే పనిదాదాపు పూర్తయింది. పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్ పనులు ముమ్మరంగా నడిపిస్తున్నారు. ఈ చెరువు పనులు పూర్తయితే రైతులు రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుంది. గత రెండు విడతల్లో పునరుద్దరణ పూర్తి చేసుకున్న చెరువులతో ఆశించిన సత్ఫలితాలు అందాయన్నారు.చెరువులు పూర్వ వైభవం సంతరించుకున్నాయి. దాదాపు అన్ని చెరువులు నీటి నిల్వలతో కళకళలాడుతున్నాయని చెప్పారు. వేసవి కాలంలోనూ ప్రజల అవసరాలు, మూగ జీవాలను తాగునీరందిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశానుసారం నిర్ధీత గడువులోగా చెరువు పనులను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నాము. కాంట్రాక్టర్లపై వత్తిడి తీసుకొచ్చి నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేయిస్తున్నాము. వర్షాకాలంలో కురిసే వరద నీటిని వృధా కాకుండా చెరువులకు మళ్లించాలన్నదే ప్రధాన ధ్యేయం. ఆ దశగా పనులు జరుగుతున్నాయని రామన్న వివరించారు. ఇకపోతే సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకే అందేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. సంక్షేమ పథకాలతో సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలుపుతున్నారని చెప్పారు.

## మక్కా యాత్రకు అనుమతి లేదు

### -సౌదీ నిర్ణయంతో కేంద్రం ప్రకటన

న్యూఢిల్లీ,జూన్23(ఆర్ఎన్ఎ): ఈ ఏడాది భారత్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికి అనుమతి ఇవ్వడం లేదని కేంద్ర మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నక్వీ తెలిపారు. మక్కా యాత్రను సౌదీ కూడా నిషేధించిన నేపథ్యంలో భారత ప్రభుత్వం ఈ ఇనర్ణయం తీసుకుంది. 2020 హజ్ యాత్రకు భారతీయులను పంపడం లేదని మంత్రి చెప్పారు. ఈ సారి హజ్ యాత్రం కోసం 2.3 లక్షల మంది దరఖాస్తు పెట్టుకున్నారు. వారి డబ్బును తిరిగి చెల్లించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆ డబ్బును నేరుగా దరఖాస్తుదారుడి ఖాతాల్లోకి పంపనున్నట్లు నక్వీ వెల్లడించారు. కరోనా వైరస్ నేపథ్యంలో ఇతర దేశాల నుంచి వస్తున్న యాత్రికులకు ఈ సారి అనుమతి ఇవ్వడం లేదని కూడా సౌదీ అరేబియా ప్రకటించింది. మాక్కాను విజిట్ చేసేందుకు కేవలం కొద్ది మంది సౌదీ నివాసితులకు మాత్రమే అనుమతి ఇవ్వనున్నట్లు ఆ ప్రభుత్వం సోమవారం స్పష్టం చేసింది. సోషల్ డిస్టాన్సింగ్ సూత్రాలకు అనుగుణంగా యాత్ర ఉంటుందని పేర్కొన్నది. ప్రపంచదేశాలకు చెందిన ముస్లింలు.. హజ్ యాత్రలో పాల్గొనకపోవడం ఇదే తొలిసారి అవుతుంది. జీవితకాలంలో ఒకసారైనా హజ్‌కు వెళ్లాలని ముస్లిం సోదరులు భావిస్తుంటారు. కానీ ఈ ఏడాది వారి ఆశలకు కరోనా వల్ల గండిపడినట్లు అయ్యింది. సౌదీకి చెందిన హజ్ అండ్ ఉమ్రా మంత్రిత్వశాఖ ఈ ప్రకటన చేసింది.

## ఆటో బోల్తాపడి వ్యక్తి మృతి

నల్లగొండ,జూన్23(ఆర్ఎన్ఎ): కొండమల్లేపల్లి మండలంలోని పెండ్లిపాకల రోడ్డులో సోమవారం సాయంత్రం ఆటో బోల్తా పడి వ్యక్తి మృతిచెందగా.. ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. కొండమల్లేపల్లి నుంచి 15 మంది ప్యాసింజర్లతో పేర్వాలకు వెళ్తున్న అప్పీ ఆటో పెండ్లిపాకల వద్దకు రాగానే మూలమలుపు చూసుకోకుండా డ్రైవర్ వేగంగా నడుపడంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో మండలంలోని చెన్నమనేనిపల్లికి చెందిన బాషపాక బొర్రయ్య(65) అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఆరుగురికి గాయాలయ్యాయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి క్షతగాత్రులను దేవరకొండ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ తెలిపారు.

# ఎన్‌సిపి అధ్యక్షపదవికి రాజీనామా చేసిన వాఘేలా

గాంధీనగర్,జూన్22(ఆర్ఎన్ఎ): గుజరాత్ నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజులకే శంకర్‌సింగ్ వాఘేలా ఆ పార్టీకి రాజీమానా చేశారు. సోమవారం తన రాజీనామా లేఖను ఎన్‌సీపీ అధ్యక్షుడు శరాద్‌పవార్‌కు పంపారు. పార్టీ అధ్యక్షుడిగా రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికలకు బాధ్యత వహించినా నాలుగు స్థానాలకు మూడింటిని బీజేపీ గెలుచుకుందని పేర్కొన్నారు.'రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయాలకు అనుగుణంగా ఎన్‌సీపీ అధ్యక్షుడిని మార్చాల్సిన అవసరం ఉంది. జిల్లా నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ శ్రేణులు, నాయకుల్లో నిరాశ ఆవహించి ఉందని ఆయన తెలిపారు. పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి, పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ నెల ప్రారంభంలో మాజీ ఎమ్మెల్యే జయంత్ పాటిల్‌ను ఎన్‌సీపీ అధ్యక్ష పదవి నుంచి తొలగించి వాఘేలాకు అప్పగించిన విషయం తెలిసిందే. వాఘేలా గతంలో గుజరాత్ ముఖ్యమంత్రిగానూ పని చేశారు.

# గడిచిన రెండు ఆర్థిక సంవత్సరాలలో ఇపిఎఫ్ఓ భద్రత కిందకు కొత్తగా 1.39 కోట్ల మంది

న్యూ ఢిల్లీ, జూన్ 23ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఓ) ఇటీవల ప్రచురించిన తాత్కాలిక పేరోల్ డేటా పలు ఆసక్తికరమైన అంశాలను వెలుగులోకి తెచ్చింది. ఈ డేటా మేరకు గడిచిన రెండేండ్ల కాలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈపీఎఫ్ఓ చందాదారుల సంఖ్య పెరిగింది. 2017 సెప్టెంబరు నుంచి సమాచారాన్ని విశ్లేషించి చూస్తే చందాదారుల సంఖ్య మెరుగ్గా నమోదు అయింది. ఈపీఎఫ్ఓ విడుదల చేసిన ఈ పేరోల్ డేటా 2018-19 మరియు 2019-20 సంవత్సరానికి సంబంధించిన ఏకీకృత వార్షిక గణాంకాలను వెలువరించింది. 2018 - 19 సంవత్సరంలో చందాదారుల సంఖ్యకు నికరంగా 61.12 లక్షల మంది కొత్త చందాదారులు చేరారు. 2019-20లో ఈ సంఖ్య 28 శాతం వృద్ధితో 78.58 లక్షలకు పెరిగింది. ఈపీఎఫ్ఓలో కొత్తగా చేరిన చందాదారులు మరియు వారు చెల్లించిన చందా ఆధారంగా ఈ సమాచారాన్ని ప్రచురించారు.మంచి రాబడి కారణంగా తగ్గిన నిష్క్రమణలు..

ఇప్పటికే చందాదారులైన సభ్యులు తక్కువ మొత్తంలో ఈపీఎఫ్ఓ సభ్యత్వాన్ని వదులుకోవడంతో పాటుగా వివిధ కారణాల వల్ల నిష్క్రమించిన సభ్యులచే తిరిగి సంస్థలో చేరడం వల్ల చందాదారుల సంఖ్య పెరిగింది. ఇతర సామాజిక భద్రతా సాధనాలు మరియు ఫిక్స్డ్ డిపాజిట్లతో పోలిస్తే 2019-20 సంవత్సరానికి అత్యధికంగా 8.5 శాతం మేర పన్ను రహిత రాబడి ఈపీఎఫ్ఓలో లభించడం, మునుపటి సంవత్సరంతో పోలిస్తే 2019-20 సంవత్సరానికి దాని నిష్క్రమణలు దాదాపు 10 శాతం తగ్గడం కూడా ఈపీఎఫ్ఓ సభ్యత్వం నుంచి ఎక్కువ సంఖ్యలో సభ్యులు వైదలగకుండా ఉండేందుకు దోహదం చేసింది. అంతేకాకుండా, నిష్క్రమించిన సభ్యులు తిరిగి చేరడం 2018-19లో 43.78 లక్షల మేర ఉండగా ఇది సుమారు 75 శాతం పెరుగుదలతో 2019-20 సంవత్సరానికి 78.15 లక్షలకు చేరింది.

ఆకట్టుకున్న ఆటో-ట్రాన్స్ ఫర్ సౌకర్యం..

ఉద్యోగం మారినప్పటికీ పాత ఖాతా నుండి కొత్త ఖాతాకు పీఎఫ్ బ్యాలెన్స్‌ను ఇబ్బంది లేకుండా బదిలీ చేసే ఆటో-ట్రాన్స్‌ఫర్ సౌకర్యం సభ్యులు తమ సభ్యత్వం కొనసాగించడాన్ని నిర్ధారించడంలో చాలా సందర్భాల్లో ప్రధాన పాత్ర పోషించింది. 2019-20 మధ్య వయస్సుల వారీగా విశ్లేషణ చేసి చూస్తే 26-28, 29-35 మరియు 35 దాటిన వారి నికర నమోదు మునుపటి సంవత్సరంతో పోలిస్తే 50 శాతం కంటే ఎక్కువగా పెరగడం విశేషం. ఆన్‌లైన్ మోడ్ సేవల డెలివరీ నాణ్యతలో వేగవంతమైన మెరుగుదల దేశంలోని శ్రామికశక్తిని ఈపీఎఫ్ఓ సేవల వైపు చూసేలా ఆకర్షించింది. అంతే కాకుండా, పీఎఫ్‌లో చేరడం.. ఇక్కడ చందా కట్టిన పైసలు ఇకపై లాక్-ఇన్ డబ్బుగా చూడనక్కర్లేదు అనే భావన ప్రజల్లో మరింత విశ్వాసాన్ని నింపింది. ఈపీఎఫ్ఓ సంస్థ కోవిడ్-19 నేపథ్యంలో అడ్వాన్స్ చెల్లింపులను మూడు రోజుల్లో పరిష్కరించడంతో, పీఎఫ్‌లో చేరడం ఇప్పుడు పీఎఫ్‌ను ద్రవ ఆస్తిగా చూడవచ్చుననే భావనను పెంపొందిస్తోంది. సంక్షోభ సమయంలో చందాదారుల అవసరాల్ని ఈపీఎఫ్ఓ సంస్థ సకాలంలో తీర్చగలవు అనే నమ్మకం చందాదారుల్లో పెరిగింది. అదేవిధంగా, నిరుద్యోగం, వివాహ వ్యయం, ఉన్నత విద్య, గృహ నిర్మాణం మరియు వైద్య చికిత్స విషయంలోనూ పీఎఫ్ అడ్వాన్స్ పొందే సౌకర్యాన్ని సర్కారు కలిపించింది.

శ్రామిక శక్తిలో పెరిగిన మహిళల భాగస్వామ్యం..

మునుపటి సంవత్సరాలతో పోలిస్తే 2019-20 సంవత్సరంలో మహిళా కార్మికుల నమోదు 22 శాతం పెరిగింది. శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం పెరుగుదలను ఇది సూచిస్తోంది. 2018-19 మరియు 2019-20 సంవత్సరాల్లో మొత్తం 1.13 లక్షల కొత్త సంస్థలు మొదటి సారిగా ఈపీఎఫ్ఓ పరిధిలోనికి అడుగుపెట్టినట్టుగా తాజా డేటా సూచిస్తుంది. చేరిక ప్రక్రియ సరళీకరణ.. పోర్టల్ ద్వారా ఎలక్ట్రానిక్ చలాన్ కమ్ రిటర్న్ (ఈసీఆర్) ఆన్‌లైన్‌లో దాఖలు.. స్వచ్ఛంద కాంప్లియెన్స్ సదుపాయాలు ఆయా సంస్థలు పీఎఫ్ కోడ్‌ను సులభంగా పొందటానికి వీలు కల్పిస్తోంది. పరిశ్రమల వర్గం వారీగా విశ్లేషణలు చేస్తే ఆసుపత్రులు మరియు ఫైనాన్సింగ్ ఎస్టాబ్లిష్మెంట్స్ 50 శాతం కంటే ఎక్కువ వృద్ధిని కనబరిచాయి, అయితే ట్రేడింగ్ ఒ కమర్షియల్ సంస్థలు, వస్త్రాలు మరియు క్లీనింగ్ మరియు స్వీపింగ్ సేవలను అందించే సంస్థల నికర నమోదు దాదాపు 20 శాతం కంటే ఎక్కువగా ఉన్నాయి. 2019-20 ఎకనామిక్ సర్వే ద్వారాధ్రువీకరించబడిన విధంగా భారతీయ ఉపాధి మార్కెట్ నందు ఎక్కువ ఉద్యోగాల క్రమబద్ధీకరణజరుగుతోందనేందుకు ఇది ఒక సూచికగా నిలుస్తోంది.

## తరచూ ఉల్లంఘనలకు పాల్పడేవారిని బైండోవర్ చేయించాలి

### -కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్,జూన్ 23(నేటినిజం ప్రతినిధి):వివిధ రకాల అల్లర్లు, మహిళలు, విద్యార్థినులపట్ల అసభ్యంగా ప్రవర్తించడం, వేధించడం లాంటి చర్యలతోపాటు బహిరంగప్రదేశాల్లో మద్యం సేవిస్తూ తరచూ పట్టుబడుతున్న వారిని సంబంధిత తహసిల్దార్‌ల వద్ద బైండోవర్ చేయించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి కమిషనరేట్‌లోని పోలీసు అధికారులను ఆదేశించారు. బైండోవర్ అమల్లో ఉన్నకాలంలో ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరంగా తీసుకునే చర్యలపై కూడా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

పైతరహా నేరాలకు పాల్పడేవారిని బైండోవర్ చేయించినట్లయితే నేరాలు నియంత్రణలోకి వస్తాయని తెలిపారు. బైండోవర్ అమల్లో ఉన్నకాలంలో ఉల్లంఘనలకు పాల్పడే వారికి ఒకలక్షరూపాయల వరకు జరిమాన, 06నెలల జైలు లేదా రెండునూ విధించబడుతాయని హెచ్చరించారు. వివిధ రకాల సమస్యలతో పోలీస్‌స్టేషన్లకు వచ్చే ప్రజలు గుమికూడిఉండకుండా చూడాలని, ప్రవేశద్వారం వద్ద చేతులను శుభ్రంగా కడుక్కునేందుకు సబ్బులు,శానిటైజర్లు, సరిపడా నీటిని ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ విపత్కర పరిస్థితుల్లో సామాజికదూరం పాటించడం తమబాధ్యతగా అన్నివర్గాల భావించాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకుని వెళ్ళే వాహనదారులపై కేసులను నమోదుచేయడంతోపాటు సదరు వాహనాలను సీజ్‌చేయాలని ఆదేశించారు. అతివేగం, ఓవర్‌లోడ్ కారణంగా అనేకరోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డుప్రమాదాల నియంత్రణ చర్యల్లో భాగంగా ఈ చర్యలను తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఓవర్‌లోడ్‌తో వాహనాలను నడిపే వాహనడ్రైవర్లకు సంబంధించిన లైసెన్సుల రద్దుకోసం రవాణాశాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా కమిషనరేట్‌వ్యాప్తంగా పోలీసులు మొక్కలు నాటేందుకు ప్రణాళికలను రూపొందించుకుని సిద్దంగా ఉండాలని తెలిపారు. వివిధ రకాల పండ్లమొక్కల పెంపకానికి కూడా ఇందులో ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. నాటిన ప్రతిమొక్కను సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పోలీసులు తమవంతుతోపాటు తమకుటుంబాలు, ఇతరస్నేహితులు,బంధువుల ద్వారాకూడా మొక్కలను నాటింపజేయాలని సూచించారు. పర్యావరణంలో సమతుల్యతలోపించడం వల్లనే కాలుష్యప్రభావం పెరుగుతున్నదని, భవిష్యత్‌తరాలకు ఆరోగ్యవంతమైన వాతావరణం అందించడం కోసం మొక్కల పెంపకానికి ముందుకురావాలని పిలుపునిచ్చారు.

**కమిషనరేట్‌లో అమల్లోఉన్న నిషేధాజ్ఞలు**

కమిషనరేట్‌వ్యాప్తంగా ఎలాంటి ఊరేగింపులు, ఎక్కువమంది జమకూడిఉండకుండా నియంత్రణ చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. ఈమేరకు వివిధ రకాల నిషేధాజ్ఞలు కమిషనరేట్‌లో అమల్లోఉన్నాయని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కరోనా వేళ రాష్ట్రాలను విస్మరించిన మోడీ

### -కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో సోనియా

న్యూఢిల్లీ,జూన్23(ఆర్ఎన్ఎ): కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ భరోసా ఇచ్చినప్పటికీ దేశంలో కరోనా మహమ్మారి తీవ్రత పెరుగుతూనే ఉన్నదని సోనియా గాంధీ ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా నియంత్రణ భారాన్ని రాష్ట్రాలపై మోపిన మోదీ, అదనంగా ఎలాంటి ఆర్థిక సహాయం చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం మంగళవారం జరిగింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ భేటీలో మాజీ ప్రధాని, పార్టీ సీనియర్ నేత డాక్టర్ మన్మోహన్ సింగ్, రాహుల్ గాంధీతోపాటు ఇతర నేతలు పాల్గొన్నారు. సీడబ్ల్యూసీలో సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆ పార్టీ నేత ఆర్ఎస్ సుర్జేవాలా ట్వీట్టర్ ద్వారా వెల్లడించారు.

# ఉద్యమంలా హరితహారం కార్యక్రమం

### అధికారులకు దిశానిర్దేశం చేసిన ఎర్రబెల్లి

హైదరాబాద్,జూన్22(ఆర్ఎన్ఎ): హరితహారం కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. విరివిగా మొక్కలు నాటి వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు.

ఆరో విడత తెలంగాణకు హరితహారం కార్యక్రమంపై హైదరాబాద్‌లోని తన పేషీ నుంచి ముందస్తు సన్నాహకంగా అడిషనల్ కలెక్టర్లు, జెడ్పీ సీఈవోలు, డీఆర్ డీవోలు, డీపీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, సర్పంచ్ లు, మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కలు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా అవి బతికేలా చూడాలి. గ్రామ సభల ద్వారా ప్రజలను సమాయత్తం చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లోని ఎ÷÷-లాంటేషన్, గ్రీన్ కవర్ కమిటీలు క్రియాశీలకంగా పని చేయాలని, ఎప్పటిక ప్పుడు నర్సరీలు, నాటిన మొక్కలను తనిఖీ చేస్తూ, అధికారులు పర్యవేక్షించాలన్నారు. హరిత హారం -2020 ప్రాధాన్యతపై సన్నాహక చర్యలు చేపట్టాలి.

ప్రజాప్రతి నిధులు సహా, జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు పర్యవేక్షించాలని మంత్రి ఎర్రబెల్లి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ రఘునందన్ రావు, ఉపాధి హామీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిఎంజివై పథకానికి ఆమోదం

ప్రధానమంత్రి గ్రామీణ సడక్‌యోజన(పీఎంజీఎస్‌వై) పథకం కొంద ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపినమూడోదశ, బ్యాచ్-1 పనులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

ఈ మేరకు 1,119.94 కి.మీ. మేర 152 పనులకు అనుమతులు లభించాయి. ఈమొత్తం పనులను 658.31 కోట్ల రూపాయలను నిర్వహించనున్నారు.

దీంతో రోడ్లు లేని గ్రామీణ ప్రాంతాలు, ఆవాసాలు, ఏజెన్సీ ప్రాంతాలకు రోడ్లు వేసే అవకాశం కలుగుతుంది. కొత్తగా గ్రామాల నుంచి మండల కేంద్రాలకు లింక్ రోడ్లు కూడా వేసే వీలుంటుంది.

నిర్ణీత నిబంధల మేరకు ఆయా పనులు చేపట్టడానికి వీలుంది. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ గ్రామీణాభివృద్ధి, పంచాయి తీరాజ్‌శాఖకు లేఖ అందింది.

దీంతో కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర పంచాయితీరాజ్,గ్రామీణాభివృద్ధి , గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఆయా పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

# భార్య,అత్తను కాల్చి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి

### మానసిక ప్రశాంతత లేకుండా చేశారనే ఘాతుకం

### సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు గుర్తించిన పోలీసులు

కోల్‌కత్తా,జూన్23(ఆర్ఎన్ఎ): బెంగళూరు, కోల్‌కత్తా నగరాల్లో దారుణం జరిగింది. అమిత్ అగర్వాల్ అనే ఒక వ్యక్తి అత్తను, భార్యను చంపి తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముందుగా బెంగళూరులో భార్య శిల్పిని చంపిన అమిత్ అగర్వాల్.. అక్కడి నుంచి నేరుగా విమానంలో కోల్‌కత్తాకు వెళ్లాడు. అక్కడ

అత్త లలిత దందానియాను కాల్చి చంపాడు. అనంతరం తనను తాను షూట్ చేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెంగళూరుకు చెందిన అమిత్ అగర్వాల్‌కు భార్య శిల్పితో విభేదాలు తలెత్తాయి. గొడవలు మరింత ముదరడంతో విడాకుల కోసం ఇద్దరూ కోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తున్నది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం అమిత్ అగర్వాల్ బెంగళూరులోని భార్య ఫ్లాట్‌కు వెళ్లి ఆమెను కాల్చిచంపాడు. అక్కడి నుంచి నేరుగా విమానంలో కోల్‌కతాకు వెళ్లి అత్తమామలతో గొడవపడ్డాడు. మాటామాటా పెరుగడంతో అత్త లలిత దందానియాను షూట్ చేశాడు. దీంతో భయంతో తప్పించుకుని పారిపోయిన మామ సుభాష్ దందానియా పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేసరికి అమిత్ అగర్వాల్ కూడా రక్తపు మడుగులో పడి ఉన్నాడు. అనంతరం పోలీసులు అమిత్ అగర్వాల్ జేబులో సూసైడ్ నోట్‌ను గుర్తించారు. జీవితంలో తనకు ప్రశాంతత లేకుండా చేసినందుకు బెంగళూరులో భార్యను, కోల్‌కతాలో అత్తను హత్యచేసి తాను ఆత్మహత్యకు పాల్పడినట్లు సూసైడ్ నోట్‌లో అమిత్ అగర్వాల్ పేర్కొన్నారు. దీంతో కోల్‌కతా పోలీసులు బెంగళూరు పోలీసులకు శిల్ప హత్యపై సమాచారం ఇచ్చారు.

# ఎమ్మెల్యే సోదరి కుటుంబానిదే ఆత్మహత్య

### దొరికిన లేఖ ఆధారంగా పోలీసుల దర్యాప్తు

### వివరాలు వెల్లడించిన సిపి కమలాసన్ రెడ్డి

కరీంనగర్,జూన్23(ఆర్ఎన్ఎ): గత జనవరి 27న తిమ్మాపూర్ మండలం ఆలూరు పెద్ద ఎస్ఆర్ఎస్పి కాలువలో పడి చనిపోయిన సత్యనారాయణ రెడ్డి కుటుంబం మృతిని పోలీసులు ఆత్మహత్యగా తేల్చారు. పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సోదరి ఫ్యామిలీ కావడంతో పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టి నిజాలు తేల్చారు. సత్యనారాయణ రెడ్డి నిర్వహించే షాప్ లో దొరికిన లేఖ ఆధారంగా వీరంతా ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారణకు వచ్చినట్టు సీపీ కమల్ హాసన్ రెడ్డి పేర్కొన్నారు. లెటర్ లోని హ్యాండ్ రైటింగ్, ఇతర పుస్తకాల్లో రాసిన హ్యాండ్ రైటింగ్ ఒకటేనని ఫోరెన్సిక్ పరీక్షల్లో తేలినట్టు సీపీ స్పష్టం చేశారు.

రామడుగు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన సత్యనారాయణ రెడ్డి కరీంనగర్ లోని బ్యాంక్ కాలనీలో నివాసముండేవారు. ఒక ఫెర్టిలైజర్ షాప్ నిర్వహించడంతో పాటుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు.

తరచూ విహారయాత్రలకు వెళ్లే అలవాటున్న ఆ కుటుంబం జనవరి 27న కూడా భార్య రాధ, కూతురు వినయ్ శ్రీ తో కలిసి సత్యనారాయణ రెడ్డి కారులో వెళ్లారు. దాదాపు 20 రోజుల నుంచి ఆ కుటుంబం గురించి ఎలాంటి సమాచారం లేకపోవడంతో బంధువులంతా కూడా విహారయాత్రకే వెళ్లిందనుకున్నారు.

కానీ ఫిబ్రవరి 17 ఆదివారం రోజున మానేరు కాలువలో సత్యనారాయణ రెడ్డి కారు కనిపించింది.

స్థానికుల సమాచారంతో పోలీసులు ఆ కారును పరిశీలించగా అందులో సత్యనారాయణ రెడ్డి , అతని భార్య రాధ, కూతురు వినయ్ శ్రీ శవాలు కుళ్లిన స్థితిలో బయటపడ్డాయి.

ఆధారాలను బట్టి ఆ కుటుంబం పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సోదరి కుటుంబం అని తేలడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో భాగంగా సత్యనారాయణ రెడ్డి నిర్వహిస్తున్న ఫెర్టిలైజర్ షాప్ లో పోలీసులకు ఓ సూసైడ్ నోట్ లభించింది. పోలీసులు ఆ నోట్‌ను , సత్యనారాయణ రెడ్డి గతంలో రాసిన వివిధ పుస్తకాలను పరిశీలించి వాటిని ఫోరెన్సిక్ టెస్ట్‌కు పంపారు. లెటర్ లోని హ్యాండ్ రైటింగ్, ఇతర పుస్తకాల్లో రాసిన హ్యాండ్ రైటింగ్ ఒకటేనని ఫోరెన్సిక్ పరీక్షల్లో తేలడంతో సత్యనారాయణ రెడ్డి కుటుంబం ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు ధృవీకరించారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

## అమరుల విషయంలో తెలంగాణ విధానం భేష్

### అన్ని రాష్ట్రాలు దీన్ని ఫాలో కావాలి: సింఘ్వీ

న్యూఢిల్లీ,జూన్22(ఆర్ఎన్ఎ): కల్నల్ సంతోష్‌బాబు కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచినట్లుగానే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని కాంగ్రెస్ కోరింది. కల్నల్ సంతోష్ భార్య సంతోషికి.. 5 కోట్ల చెక్‌తో పాటు డిప్యూటీ కలెక్టర్ జాబ్ ఆఫర్ లెటర్‌ను అందజేశారు. దీని పట్ల కాంగ్రెస్ నేత, రాజ్యసభ సభ్యుడు అభిషేక్ సింఘ్వీ స్పందించారు. కల్నల్ సంతోష్ భార్య సంతోషికి తెలంగాణ సర్కార్ డిప్యూటీ కలెక్టర్ నియామక పత్రాన్ని అందజేసిందని, కేంద్ర ప్రభుత్వంతో పాటు ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇలాంటి విధానాన్ని అనుసరించాలని ఎంపీ అభిషేక్ సింఘ్వీ అభిప్రాయపడ్డారు. తన ట్విట్టర్ అకౌంట్ ద్వారా స్పందించిన ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.తెలంగాణ సీఎం కేసీఆర్.. సైనిక కుటుంబాన్ని ఆదుకున్న తీరును ఆయన ప్రశంసించారు. తెలంగాణ ఫాలో అవుతున్న విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా అనుసరించాలని సింఘ్వి తన ట్వీట్‌లో అభిప్రాయపడ్డారు. గాల్వన్ లోయలో ఈనెల 15వ తేదీన జరిగిన సైనిక ఘర్షణలో 20 మంది భారతీయ సైనికులు వీరమరణం పొందారు. అయితే ఆ ఘర్షణల్లో తమ కమాండింగ్ ఆఫీసర్ కూడా చనిపోయినట్లు తాజాగా చైనా అంగీకరించింది. ఇవాళ జరిగిన కమాండర్ స్థాయి సమావేశంలో ఈ విషయాన్ని చైనా వెల్లడించినట్లు తెలుస్తోంది.

# జాతీయ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటాలి



యాదాద్రి భువనగిరి, జూన్ 23: ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా జాతీయ రహదారి 65కు ఇరువైపులా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సీఎం కార్యాలయం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం తంగేడువనంలో నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల కలెక్టర్లతో హరితహారం పై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతీయ రహదారి 65 కి ఇరువైపులా ఎన్ని మొక్కలు నాటారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జాతీయ రహదారికి ఇరువైపులా మూడు వరుసలో మొక్కలు నాటాలని సూచించారు. డివైడర్ మధ్యలో చక్కని పూల మొక్కలు, రంగురంగుల మొక్కలు నాటాలన్నారు.

జాతీయ రహదారి పరిధిలోని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలో కమిషనర్లు పంచాయతీ కార్యదర్శులను భాగస్వాములను చేస్తూ మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. మొక్కల పెంపకం లో నిర్లక్ష్యం వహిస్తే ఉద్యోగాలు పోతాయని హెచ్చరించారు. రేపటి నుంచే ప్లాంటేషన్ పనులు మొదలు పెట్టాలని తెలిపారు. ఈ నెల 25న సీఎం కేసీఆర్ హరితహారాన్ని అట్టహాసంగా ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అదే రోజు జాతీయ రహదారికి ఇరువైపులా మొక్కలు పెద్ద ఎత్తున నాటాలని తెలిపారు. తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు నాటే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.

# ఇంట్లో పేలిన సిలిండర్

### ముగ్గరికి తీవ్ర గాయాలు..ఆస్పత్రికి తరలింపు

కరీంనగర్,జూన్23(నేటినిజం ప్రతినిధి): పిండివంటలు చేస్తున్న క్రమంలో ప్రమా దవశాత్తు వంట గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ముగ్గరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం రామగుండం సింగరేణి కాలనీలోని టి2-80 క్వార్టర్లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణి సంస్థ రామగుండం రీజియన్-3 ఓ.సి.పి-1లో ఫిట్టర్ గా విధులు నిర్వహిస్తున్న పొన్నం రాజిరెడ్డి టి2-80లో కుటుంభం సభ్యులతో నివాసముంటున్నాడు. సోమవారం రాజిరెడ్డి భార్య సరోజిని, ఇంటి వెనుకాల ఉన్న సన్నిహితురాలుతో కలిసి ఇంట్లో పిండి వంటలు చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ నుండి మంటలు చెలరేగాయి. అదే సమయంలో ఇంట్లో ఉన్న సరోజిని కుమారుడు శరత్ మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసాడు.కానీ మంటలు తీవ్రం కావడంతో అదుపు చేయలేకపోయాడు. ఇరుగుపొరుగు పరిస్థితిని గమనించి వారిని ఇంటి నుండి బయటకు తీసుకువచ్చారు. కాగా ఈ ఘటనలో సరోజిని, వనమాలకు స్వల్ప గాయాలు కాగా శరత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సింగరేణి రెస్క్యూ టీమ్ సకాలంలో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సంఘటన స్థలానికి గోదావరిఖని టూ టౌన్ సి.ఐ కె.శ్రీనివాస్ రావు, ఎస్సై మందాటి శ్రీనివాస్ లు చేరుకొని పరిస్థితిని సమీక్షించి గాయపడిన ముగ్గురినిగి సింగరేణి హాస్పిటల్ కు తరలించారు. హాస్పిటల్ లో ప్రథమ చికిత్స అందించి ముగ్గురిని గోదావరిఖని ఏరియా హాస్పిటల్ కు తరలించారు. గ్యాస్ సిలిండర్ నుండి మంటలు చెలరేగడంతో ఒక్కసారిగా భయనకవాతవర్ణం చోటు చేసుకుంది. ఎలాంటి ప్రాణాపాయం జరుగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## ఎస్ కోట ఎమ్మెల్యేకు పాజిటివ్-హోం క్వారంటైన్‌లో ప్రజాప్రతినిధి

విజయనగరం,జూన్23(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ఇద్దరు ముగ్గురు ప్రజాప్రతినిధులు కరోనా బారిన పడ్డారు. తాజాగా ఏపిలోనూ ఓ ఎమ్మెల్యేకు కరోనా సోకింది. ఇప్పటివరకు కేవలం సామాన్య ప్రజానీకం మాత్రమే కరోనా బారినపడగా, ఇప్పుడు మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కోవిడ్ మహమ్మారికి చిక్కుతున్నారు. తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులు వైరస్ బారినపడారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ లో తొలిసారి అధికార పార్టీ ఎమ్మెల్యేకు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. విజయనగరం జిల్లా శృంగవరపు కోట ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు కరోనా సోకింది. గత రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు తాజాగా నిర్వహించిన పరీక్షల్లో కరోనా పాజిటివ్‌గా తేలింది.శ్రీనివాసరావు ఈనెల 10న అమెరికా నుంచి స్వస్థలానికి వచ్చారు. అమెరికా నుంచి వచ్చాక పరీక్షలు చేయించుకోగా ఆయనకు నెగిటివ్ వచ్చింది. తాజా పరీక్షల్లో మాత్రం పాజిటివ్ రావడంతో ఎమ్మెల్యే శ్రీనివాసరావు హోం క్వారంటైన్‌కు వెళ్లారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఐతే శ్రీనివాసరావు మొన్న ముగిసిన అసెంబ్లీ బ్జడెట్ సమావేశాలకు వచ్చారు. రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేశారు. అందువల్ల ఇప్పుడు మిగతా ఎమ్మెల్యేలు, మంత్రులకు టెన్షన్ పట్టుకుంది.

## కరోనా బారిన పడకుండా జాగ్రత్త పడాలి

### -ఒలింపిక్‌డే సందర్భంగా మంత్రి శ్రీనివాసగౌడ్ పిలుపు

హైదరాబాద్,జూన్23(ఆర్ఎన్ఎ): క్రీడాకారులు కరోనా మహమ్మారి బారినపడకుండా భౌతిక దూరాన్ని పాటిస్తూ తమ ఫిజికల్ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాలని క్రీడా,పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. మంగళవారం ఒలింపిక్‌డే సందర్భంగా తన నివాసం నుంచే రాష్ట్రంలో ఒలింపిక్ ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ సారధ్యంలో తెలంగాణ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నామని అన్నారు. అందులో భాగంగానే క్రీడా పాలసీ రూపకల్పన పై కేబినెట్‌సబ్ కమిటీని నియమించారని అన్నారు. క్రీడా పాలసీ కమిటీలో అనుభవజ్ఞులైన మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి, ఎర్రబెల్లిదయాకర్‌రావు వంటి వారి ఆలోచనా విధానం ద్వారా వివిధ దేశాల, రాష్ట్రాలలో అమలుచేస్తున్న క్రీడా విధి విధానాలను అధ్యయనం చేసి, ప్రముఖ కోచ్‌లు, క్రీడా కారులతో సంప్రదించి దేశంలోనే అత్యుత్తమ క్రీడాపాలసీని తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఒలింపిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ లాల్‌బహదూర్ స్టేడియంలోని తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యాలయం సందర్శించారు. ఈసందర్భంగా ఒలింపిక్ అసోసియేషన్ సీనియర్ ఉపాధ్యక్షులు వేణుగోపాలచారి , మాజీ అధ్యక్షులు రంగారావు, ప్రధాన కార్యదర్శి జగదీశ్‌యాదవ్, స్పోర్ట్స్ ఛైర్మన్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరోనాతో మరో సీరిస్ వాయిదా

### -కివీస్ టెస్ట్ సీరిస్ రద్దు చేసుకున్న బంగ్లా

ఢాకా,జూన్23(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ కారణంగా బంగ్లాదేశ్‌లో న్యూజిలాండ్ పర్యటన వాయిదా పడింది. టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా ఆగస్టు-సెప్టెంబర్ మధ్య రెండు టెస్టులు ఆడేందుకు కివీస్ జట్టు బంగ్లాకు రావాల్సి ఉంది. కాగా కరోనా తీవ్రంగా ఉండడంతో సిరీస్ వాయిదా వేయాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ) నిర్ణయించింది. కాగా బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ మోర్తజతో పాటు ప్లేయర్లు నజుముల్ ఇస్లాం, నఫీస్ ఇక్బాల్..కరోనా బారిన పడిన విషయం తెలిసిందే. కొవిడ్?-19 నేపథ్యంలో ఆగస్టులో సిరీస్‌కు ఆతిథ్యమివ్వడం చాలా సవాల్‌తో కూడుకున్న విషయం. ఆటగాళ్లు, సిబ్బంది, మిగిలిన వారి ఆరోగ్యం విషయంలో మేం ఏ మాత్రం రాజీ పడలేం. అందుకే సిరీస్‌ను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. పరిస్థితిని అర్థం చేసుకున్నందుకు న్యూజిలాండ్ క్రికెట్ కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అని బీసీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నిజాముద్దీన్ చౌదరీ ప్రకటించారు. కాగా ఈ నెలలో ఆస్ట్రేలియా బంగ్లాకు రావాల్సి ఉన్నా ఆ సిరీస్ కూడా వాయిదా పడిన సంగతి తెలిసిందే. జూలైలో శ్రీలంకకు బంగ్లాదేశ్ వెళ్లాల్సి ఉన్నా.. ఈ పర్యటన కూడా అనుమానంగానే మారింది.

## ఆగని బంగారం ధరల దాడి

### -కొనుగోళ్లు లేకపోయినా రేట్లు పెరుగదల

హైదరాబాద్,జూన్23(ఆర్ఎన్ఎ): బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి. బంగారం ధర పది గ్రాములకు అనుకున్నట్లుగానే 50వేలు దాటింది. కొనుగోళ్లు లేరకున్నా, ప్రజలు ముందుకు రాకున్నా ధరల దాడి మాత్రం ఆగడం లేదు. సోమవారం పసిడి సరికొత్త రికార్డు స్థాయిని నమోదు చేసింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.50,580కి చేరుకుంది. 22 క్యారెట్ల గోల్డ్ పది గ్రాముల రేటు రూ.46,290 పలికింది. వెండిదీ అదే బాట. కేజీ సిల్వర్ రూ.48,800కి ఎగబాకింది. ముంబై బులియన్ మార్కెట్లో 10 గ్రాముల బంగారం (99.9 శాతం స్వచ్ఛత) రూ.48,130 పలుకగా.. కేజీ

వెండి ధర రూ.48,825కి చేరుకుంది. అంతర్జాతీయంగా విలువైన లోహాలకు డిమాండ్ పుంజుకోవడం ఇందుకు కారణమైంది. భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 11 గంటలకు అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 1,767 డాలర్లు, వెండి 18 డాలర్ల ఎగువన ట్రేడవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా కరోనా కేసులు ఉధృతమవుతుండటంతో పాటు ఆర్థిక పునరుద్ధరణ చాలా కాలం పట్టవచ్చని అమెరికా ఫెడ్ రిజర్వ్ ఉన్నతాధికారి ఒకరు ఆందోళన వ్యక్తం చేయడంతో విలువైన లోహాలకు డిమాండ్ పెరిగింది. సంక్షోభ కాలంలో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న బంగారంలోకి ఈక్విటీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు పెరుగుతుండటంతో ధరలు ఎగబాకుతున్నాయి.

## ఇళ్లపట్టాలు రాలేదన్న ఫిర్యాదు రాకూడదు

### 8న పట్టాల పంపిణీ సక్రమంగా సాగాల్సిందే

### అధికారులకు దిశానిర్దేశం చేసిన సిఎం జగన్

అమరావతి,జూన్23(ఆర్ఎన్ఎ): జూలై 8న ఎట్టి పిరస్థితుల్లోనూ పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. 29-30 లక్షల ఇళ్లపట్టాలు

ఇవ్వబోతున్నామని పేర్కొన్నారు. ఇది అత్యంత ప్రాధాన్యతతో కూడిన కార్యక్రమం అని అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో జిల్లాల వారీగా ఇళ్లపట్టాలపై పరిస్థితిని సమీక్షించారు. ఈ సమావేశానికి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. భూసేకరణ, పొజిషన్, ప్లాట్ల అభివృద్ధి మీద నిశితంగా పర్యవేక్షించాలని అధికారులను సూచించారు. నూటికి నూరు శాతం ఇళ్లపట్టాలు పంపిణీ కావాలని, కచ్చితంగా ఇళ్లపట్టాలు పంపిణీ కావాలన్న విషయాన్ని పదేపదే గుర్తుంచుకోవాలని సిఎం పదేపదే సూచించారు. ప్లాట్ల కేటాయింపు కోసం లాటరీ ప్రక్రియ వెంటనే పూర్తి కావాలి. ఇళ్ల పట్టాల లబ్దిదారుల తుది జాబితా గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలి. కోవిడ్ పరిస్థితులు తగ్గుముఖం పట్టిన తర్వాత గ్రామాల్లో పర్యటిస్తాను. ఇంటిపట్టా లేదని ఎవ్వరూ చేయి ఎత్తకూడదని' సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. పారదర్శకంగా, ప్రభావవంతంగా ఇళ్లపట్టాలను పంపిణీ చేయాలని సీఎం పేర్కొన్నారు. సరైన కారణంగా లేకుండా ఎవరికైనా ఇంటి పట్టా రాలేదంటే అధికారులను బాధ్యులను చేస్తానని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటిపట్టా ఇవ్వాలన్నారు. తనకు ఓటు వేయని వారికి కూడా ఇళ్లపట్టా ఇవ్వాలని సీఎం తెలిపారు. పెన్షన్ కార్డుకు 10 రోజులు, రేషన్ కార్డుకు 10 రోజులు, ఆరోగ్యశ్రీ కార్డు 20 రోజులు, ఇంటి పట్టా 90 రోజుల్లో గ్రామ సచివాలయాల ద్వారా అందాలన్నారు. ఈ గడువులోగా అందించేలా వ్యవస్థలను తయారుచేయాల్సిన బాధ్యత కలెక్టర్లదేనన్నారు. వివక్ష లేకుండా, సంతృప్తస్థాయిలో అందాలని సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. సమీక్షలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆదిమూలపు సురేశ్, సిఎస్ నీలం సాహ్ని, డిజిపి గౌతం సవాంగ్ తదితరులు పాల్గొన్నారు.




ఇళ్లపట్టాల పంపిణీపై మంగళవారం అధికారులు, మంత్రులతో సమీక్షించిన సిఎం వైఎస్ జగన్

## కళ్యాణ వేంకటేశ్వరాలయంలో స్నపన తిరుమంజనం

తిరుపతి,జూన్23(ఆర్ఎన్ఎ): తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఈరోజు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయంలో శ్రీవారి సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ.

ఈ సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు నిర్వహించారు. ఉదయం 6.30 నుంచి11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అని వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం మొత్తం సంప్రోక్షణం చేస్తారు. మధ్యాహ్నం 12.30 గంటల తర్వాత నుంచి భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తున్నారు.

# చిరస్మరణీయుడు మిమిక్రీ వేణుమాధవ్

## మనం మరచిపోయినా ఆయన కళ నిరంతరం

వరంగల్,జూన్23(ఆర్ఎన్ఎ): నేరెళ్ల వేణుమాధవ్ మరణించి అప్పుడే రెండేళ్లు గడిచాయి. ప్రొఫెసర్ జయశంకర్ జూన్ 21న మరణిస్తే జూన్ 19న నేరెళ్ల వేణుమాధవ్ గారు పరమపదించారు. కరోనా కారణంగా ఆయన వర్ధంతిని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. జయశంకర్ సారు, వేణుమాధవ్‌ల వర్ధంతుల విషయంలో ఇది కనిపించింది. ఈ రెండు కార్యక్రమాలను ప్రజలు పెద్దగా పట్టించుకున్నట్లు లేదు. పాలకులు కూడా పెద్దగా ప్రాధన్యం ఇవ్వలేదు. ఇకపోతే మిమిక్రీ కళను ప్రపంచానికి పరిచయం చేసి, దానిని ఐక్యరాజ్య సమితి వరకు తీసుకెళ్లిన ధీశాలి మన నేరెళ్ల వేణుమాధవ్ ధన్యజీవి. తన గొంతులో వెయ్యి గొంతుకలను పలికించడం ద్వారా మిమిక్రీ కళను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన కళాకారుడు తెలుగువాడ యినందుకు... భారతీయు డైనందుకు మనమంతా గర్వపడాలి. ఆయన ప్రేమించి,ప్రవచించిన మిమిక్రీని సజీవంగా మనకందించారు. మిమిక్రీ ఉన్నన్నాళ్లూ నేరెళ్ల వేణుమాధవ్ మనకు సాక్షాత్కరిస్తూనే ఉంటారు. వరంగల్ నుంచి ప్రారంభమైన నేరెళ్ల వేణుమాధవ్ మిమిక్రీ ప్రస్థానం ఐరాస వరకు వెళ్లిందంటే తెలుగువారిగా మనకన్న గర్వించేవారు ఉండరు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కాలంలోనే అమెరికాలో ప్రదర్శనకు అవకాశం రావడంతో ఆయన పేరు దేశ వ్యాప్తంగా మార్మోగినప్పుడు తెలుగువారి గుండెలు మరింత పులకించి ఉంటాయి. ఆనాటి ఘటనలు తలుచుకుంటే నేటికీ మనం పులకించకుండా ఉండలేం. ఓ కళను సృష్టించిన స్రష్ట ఆయన. దానిని శబ్దప్రక్రియగా ఓ సబ్జక్టుగా రూపొందించి భావి తరాలకు మార్గం చూపారు. అయినా పురాణాల్లోనే ఇలాంటి చాతుర్యం ఉందని, అదంతా భగవత్ కృప అని చెప్పుకుని, తన గొప్పతనమేమీ లేదని చెప్పుకోవడం ఆయన ఉదాత్తకు తార్కాణం. తనకు అబ్బిన మిమిక్రీ కళను ప్రపంచ వ్యాప్తంగా సుమారు 30 దేశాల్లో ప్రదర్శనలుగా ఇవ్వడం ఒక ఎత్తయితే 1971లో ఐక్యరాజ్య సమితిలో ప్రపంచ ప్రముఖుల గొంతులను అనుకరించి ప్రపంచం దృష్టినీ ఆకర్షించడం మరొక ఎత్తు. పదో ఏటలోనే మిమిక్రీ కళపై మక్కువ పెంచుకున్న నేరెళ్ల తన ఆశయం మేరకు మిమిక్రీపైనే దృష్టి సారించి దానిని జగద్విఖ్యాతం చేయకుండా ఉండివుంటే ఇవాళ మిమిక్రీ అన్నది ప్రపంచానికి తెలిసేది కాదు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా నడుచుకుని వ్యాపారంలో స్థిరపడి ఉన్నా మనకు నేరెళ్ల వేణుమాధవ్ అంటే ఎవరో తెలిసేది కాదు. తనకు అభిరుచి ఉన్న ఆ రంగంలోనే ఎదగాలని నిర్ణయించుకున్నందునే ఆయన గొప్పవాడయ్యారు. ఆయన జీవితం ఓ పాఠం. ఆధునిక తరానికి ఓ సక్సెస్ స్టోరీ. ఇంటర్ చదివే రోజుల్లో తండ్రి చనిపోయి ఆర్థిక పరిస్థితులు తలకిందు లైనా చదువును వదలకుండా బీఏ, బీకాం, బీఈడీ పూర్తిచేయడంతో పాటు తాను నమ్ముకున్న మిమిక్రీని కూడా పూర్తి చేసిన పట్టభద్రుడాయన. నాగయ్య గొంతుతో పోతన పద్యాలు, పాటలు ప్రాక్టీస్ చేయడం ప్రారంభించారు. భక్తపోతన చిత్రం ఆయనపై బలమైన ముద్ర వేసింది. పోతన పుట్టిన ఓరుగల్లులో పుట్టిన మట్టిబిడ్డగా వేణుమాధవ్ తన గళం బలంతో ప్రపంచాన్ని శాసించారు. తొలితరం నటుడైన చిత్తూరు నాగయ్య స్వరాన్ని అనుకరించడం ద్వారా తన కళా ప్రస్థానానికి బాటలు వేసుకున్నది మొదలు ఆయన గొంతుకలో ఎందరి గొంతుకలు ఇమిడి పోయాయో చెప్పలేం. మహామహులే ఆయన గొంతుకకు పాదాక్రాంతులయ్యారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టినా..తనకు గుర్తింపు తెచ్చిన మిమిక్రీని మాత్రం వదలకుండా పెనవేసుకుని పోయారు. అలా మొదలైన ప్రస్థానం పది వేల ప్రదర్శనల వరకు కొనసాగిందంటే ఆయన పట్టుదల ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. మిమిక్రీకి ఏమాత్రం గుర్తింపు లేని రోజుల్లోనే ఆ కళపై మక్కువ పెంచుకుని దానికి అర్థం పరమార్థం చెప్పి ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి మన వేణు మాధవ్. వైవిధ్య స్వరాలను అనుకరిస్తుంటే నవ్వుల జల్లులు కురిసేవి. ఆయన శిష్యులు ఇవాళ వందల సంఖ్యలో ఉన్నారు. ఆయన ప్రతిభాపాటవాలను గుర్తించిన భారత ప్రభుత్వం 2001లో పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసింది. కాకతీయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్లు ఇచ్చి సత్కరించాయి. వివిధ రాష్ట్రాల్లో ఆయన లెక్కలేనన్ని పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. తిరుపతిలో అభిమానుల నుంచి గజారోహణ సత్కారం అందుకున్నారు. ఇంతటి వైదుష్యం ఉన్న ఆయన రాజకీయంగా, సినీరంగాన ఎదగడానికి అవకాశాలు వచ్చినా వాటిని తృణప్రాయంగా వదిలేశారు. అనూహ్యంగా సినీ అవకాశాలనూ దక్కించుకున్నా వాటిని కూడా కొనసాగించలేదు. ఇలా లేని ఓ కళకే ఊపిరిపోసి దానిని విశ్వవ్యాప్తం చేయడం ద్వారా మిమిక్రీ అనే ప్రాచీనమైన కళకు ఓ రూపం తెచ్చి.. సరికొత్త సొబగులు అద్దారు. చివరకు దాన్ని యూనివర్సిటీ కోర్సుగా తీర్చిదిద్దారు. కనకాభిషేకాలు, గండపెండేరాలు, ఉగాది పురస్కారాలు, కళాప్రపూర్ణ బిరుదులు, ఒకటారెండా.. లెక్కలేనన్నీ అవార్డులు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2018 రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లక్షా నూటా పదహారువేల నగదు పురస్కారాన్ని ఇచ్చి గౌరవించింది.

# రైతు సంక్షేమంలో మనమే ముందున్నాం

### కన్నీళ్లు పెట్టుకుంటున్న కాంగ్రెస్ వారు: కర్నె

హైదరాబాద్,జూన్23(ఆర్ఎన్ఎ): ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రైతు సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించుకుని, అమలు చేసుకుంటున్నామని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ పేర్కొన్నారు. ఎన్నో ఇబ్బందులను అధిగమించి ముందుకు సాగుతుంటే కాంగ్రెస్ వాళ్లు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం దేశంలోనే తెలంగాణ ఒక్కటేనన్నారు.రాష్ట్ర ఆవిర్భావం మొదటి ఏడాదిలో కరెంట్ ఇబ్బంది ఉండేదని, పక్క రాష్ట్రాల నుంచి అతికష్టం మీద విద్యుత్‌ను కొనుగోలు చేసి 25లక్షల మంది బోర్లకు విద్యుత్‌ను అందించామన్నారు. గతంలో మాదిరిగా రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా విత్తనాలు, ఎరువులు ముందుగానే స్టాక్ పెట్టుకుంటున్నమని పేర్కొన్నారు. పండిన పంటకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతుకు ఉన్నటువంటి ఇబ్బందులను ఆలోచించి పంటల పెట్టుబడి పథకానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచే నిమిత్తం సీఎం కేసీఆర్ ఆదేశానుసారం రూ. సబ్సిడీతో ట్రాక్టర్లు పంపిణీ చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదని అన్నారు. తెలంగాణలో 24గంటల కరెంట్, నీళ్లు, పెట్టుబడి, ఎరువులు, విత్తనాలు ఇస్తున్నరని, తాముకూడా తెలంగాణలో కలుస్తామని మహారాష్ట్ర రైతులు అంటున్నారని తెలిపారు. వ్యవసాయానికి ఇన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తున్న సీఎం దేశంలో కేసీఆర్ ఒక్కరేనని ఆయన స్పష్టంచేశారు

# స్టెరాయిడ్ డెక్సామిథాసోన్ ఉత్పత్తిని పెంచాలి

### ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు

### భారత్ సంస్థల ఔషధ ప్రకటన సమయంలో అనూహ్య నిర్ణయం

జెనీవా,జూన్23(ఆర్ఎన్ఎ): కరోనా రోగుల పాలిట సంజీవనిగా భావిస్తున్న స్టెరాయిడ్ డెక్సామిథాసోన్ ఉత్పత్తిని పెంచాలని ప్రపంచ ఆరోగ్య సంస(డబ్ల్యూఓ) పిలుపునిచ్చింది. ఇండియా సంస్థలు రెండు డ్రగ్స్ ప్రకటించిన నేపథ్యంలో టెడ్రోస్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఇది పాత ఔషధమే తప్ప కొత్తది కాదు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న కరోనా వైరస్ రోగులకు ఈ ఔషధాన్ని వాడటం వల్ల మరణాల సంఖ్య తగ్గుతుందని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది.

ఈ క్రమంలో డబ్ల్యూహెచ్ఓ చీఫ్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ మాట్లాడుతూ 'బ్రిటీష్ ట్రయల్‌లో ఈ ఔషధం మంచి ఫలితాన్ని ఇచ్చినట్లు నిరూపితం కావడంతో డెక్సామిథాసోన్‌కు ఇప్పటికే డిమాండ్ బాగా పెరిగిందని, అందువల్ల ఉత్పత్తిని వేగవంతం చేయాలని ఆయన సూచించారు. గత వారం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ బృందం నేతృత్వంలోని పరిశోధకులు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న 2 వేల మంది రోగులకు ఈ ఔషధాన్ని ఇచ్చారు. ఇది మరణాల సంఖ్యను 35 శాతం తగ్గించినట్లు తెలిసింది. పరిశోధనలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నప్పటికీ.. డెక్సమిథాసోన్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న కరోనా రోగుల ప్రాణాలను రక్షించే సామర్థ్యాన్ని కలిగి ఉన్నదని నిరూపితమైనది. అందుకే ఈ ఔషధం వాడటానికి అనుమతిస్తున్నాం అని జెనీవాలో జరిగిన ఒక వర్చువల్ న్యూస్ కాన్ఫరెన్స్‌లో టెడ్రోస్ వెల్లడించారు.

అంతేకాక ఈ ఔషధ ఉత్పత్తిని పెంచడం.. ప్రపంచవ్యాప్తంగా వేగంగా.. దీని అవసరమున్న దేశాలకు సమానంగా పంపిణీ చేయడం.. ఎక్కువ అవసరమైన చోట దృష్టి సారించడం'అని పేర్కొన్నారు. డెక్సామిథాసోన్ 60 సంవత్సరాలుగా మార్కెట్లో ఉంది. సాధారణంగా ఈ ఔషధం మంటను తగ్గించడానికి ఉపయోగపడుతుంది. అయితే ప్రస్తుతం కరోనాతో తీవ్రమైన అనారోగ్యానికి గురైన రోగులకు మాత్రమే డెక్సామిథాసోన్ వాడాలని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది. అంతేకాక తేలికపాటి కరోనా లక్షణాలు ఉన్న రోగులకు లేదా కోవిడ్-19 నివారణ కోసం ఈ ఔషధం పనిచేస్తుందనడానికి ఎటువంటి ఆధారం లేదు. హాని కలిగించే ప్రమాదం కూడా ఉంది అని టెడ్రోస్ హెచ్చరించారు. దీని సరఫరాలో అధిక సంఖ్యలో కరోనా వైరస్ రోగులు ఉన్న దేశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని టెడ్రోస్ తెలిపారు. డబ్ల్యూహెచ్ఓ ప్రకటన ఫలితంగా నాణ్యత లేని లేదా తప్పుడు ఉత్పత్తులు మార్కెట్లోకి ప్రవేశించే ప్రమాదం ఉన్నందున..

ఈ ఔషధ ఉత్పత్తిదారులు నాణ్యతకు సంబంధించి హామీ ఇవ్వవలసి ఉంటుందని టెడ్రోస్ హెచ్చరించారు. చైనా వుహాన్ కరోనాకు జన్మస్థలంగా భావిస్తున్న క్రమంలో శాస్త్రవేత్తలు ఇక్కడి మాంసం దుకాణాలపై దృష్టి సారించారు. ఈ క్రమంలో ఈ వైరస్ మొదట జంతువుల నుంచి మానవులకు సోకిందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. కరోనాపై పనిచేస్తున్న డబ్ల్యూహెచ్ఓ అధికారి మరియా వాన్ కెర్ఖోవ్ మాట్లాడుతూ.. ఉత్తర ఐరోపాలో జరిపిన అధ్యయనాల్లో కరోనా వైరస్ మానవులకు మింక్(అమెరికాలో కనిపించే ఓ జంతువు) ద్వారా సోకినట్లు తెలుస్తుందన్నారు. నెదర్లాండ్స్, డెన్మార్క్‌లో కొన్ని మింకులు కరోనా వైరస్‌కు సానుకూలంగా ఉన్నాయి అని వాన్ కెర్ఖోవ్ చెప్పారు.

# తెలంగాణ రైతు విధానాలు దేశానికే ఆదర్శం

### అంతటా అమలు చేస్తే హరిత విప్లవం సాధ్యమే

### రైతుబంధు సమన్వయ సమితి చైర్మన్ పల్లా

వరంగల్,జూన్23(ఆర్ఎన్ఎ): తెలంగాణలో సిఎం కెసిఆర్ అనుసరిస్తున్న రైతు విధానాలను భారతదేశ వ్యాప్తంగా అమలు చేస్తే దేశంలో హరితవిప్లవం సాధించవచ్చని రాష్ట్ర రైతుబంధు సమన్వయ సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర రెడ్డి అభిప్రాయపడ్డారు. వరంగల్‌లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన వ్యవసాయరంగంలో పురోగతికి కెసిఆర్ లక్ష్యమే కారణమన్నారు. రైతులకు సాగునీరు, పెట్టుబడి పథకం,బీమా పథకం అమలు చేయడం, పండిన ధాన్యం కొనుగోలు చేయడం వంటి పథకాలు పక్కాగా అమలయితే దేశంలో కరువు కాటకాలు ఉండవన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడరని అన్నారు. ఇవన్నీ సాకారం చేసుకునే దిశగా తెలంగాణ ఒక్కో అడుగు వేస్తున్నదని, వేసిన అడుగు విజయవంతంగా సాగుతున్నదని అన్నారు. రానున్న కాలంలో తెలంగాణ వ్యవసాయ రంగంలో ఓ రోల్ మాడల్‌గా నిలవబోతున్నదని అన్నారు. రైతుబీమా పథకం దేశానికే మార్గదర్శకంగా మారనుందని అన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయాలని తపిస్తున్న సిఎం కెసిఆర్ రైతును రాజు చేయడమే లక్ష్యంగా అనేకానేక చర్యలు తీసుకుని మమ్మల్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేయడమే ఓక కీలక నిర్ణయమని అన్నారు. ఇలా వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. వ్యవసాయ రంగానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషి, ప్రవేశపెట్టిన పథకాలు గురించి ఇవాళ దేశం మొత్తం గుర్తించిందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ వ్యవసాయరంగంలో నంబర్‌వన్ రాష్ట్రంగా నిలిచిందన్నారు. రైతుబీమా పథకాన్ని అమలులోకి తీసుకువచ్చాక కుటుంబాల్లో ధైర్యం వచ్చిందన్నారు. 18 నుంచి 60 ఏండ్ల వయస్సు ఉన్న రైతులకు బీమా వర్తింపజేస్తున్నట్టు చెప్పారు. దురదృష్టవశాత్తు, అనారోగ్యకారణాల వల్ల రైతు చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.5 లక్షలు బీమా పరిహారం అందుతుందన్నారు. ఈ రకంగా దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతు బీమా అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని అన్నారు. పెట్టుబడి పథకం కింద ఎలాగైతే రైతుబంధు పథకం పక్కాగా అమలయ్యిందో ఇప్పుడు బీమా పథకం కూడా పక్కాగా అమలు జరుగుతోందని అన్నారు. ప్రతి రైతుకు ప్రభుత్వం రూ.2,271 ప్రీమియం చెల్లిస్తున్నదని, ఏ కారణం చేతనైనా రైతు మరణిస్తే నామినీకి పది రోజుల్లో రూ.5 లక్షల ఇన్సూరెన్స్ అందుతుందని చెప్పారు. అందుకే ఈ పథకాలను తెలుసుకున్న దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు సీఎం కేసీఆర్‌ను కొనియాడు తున్నాయన్నారు. రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ రైతు బీమా పథకాన్ని అమలులోకి తీసుకుని వచ్చారని పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఎన్నడూలేని విధంగా పంటలకు మద్దతు ధర కల్పిస్తున్నామని, కరోనా కాలంలోనే ధాన్యం సేకరణ చేశామని అన్నారు. పక్క రాష్ట్రాల్లో సరైన మద్దతు ధర లభించని రైతులు కూడా తెలంగాణకు వచ్చి అమ్ముకుంటున్నారని తెలిపారు. కాళేశ్వరం సహా చేపట్టిన అన్ని ప్రాజెక్టులు పూర్తి కావచ్చాయని, ఇక సాగునీటికి ఢోకా ఉండదన్నారు. ఇప్పటికే చెరువుల పునరుద్దరణ జోరుగా సాగుతోందన్నారు. దీంతో సేద్యం అన్నది రైతుకు భారం కాబోదన్నారు. దేశంలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ ఒక్కటే అని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం కల్లాల నిర్మాణం, రైతువేదికల నిర్మాణం సాగుతోందన్నారు.

# రైతన్నను కుంగదీస్తున్న వర్షాభావం

### తొలకరి వర్షాలతో విత్తుకున్న రైతుల్లో ఆందోళన

హైదరాబాద్,జూన్23(ఆర్ఎన్ఎ): ప్రస్తుత వాతావరణం చూస్తుంటే ఇంకా ఎండాకాలం కొనసాగుతున్నట్లుగా ఉంది. అక్కడక్కడా వానలు పడుతున్నా పలుచోట్ల వర్షాలు ముఖం చాటేయడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. తొలకరితోనే విత్తనాలు విత్తిన రైతుల్లో ఆందోళన తీవ్రం అవుతోంది. గత వారం రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో తొలకరి వర్షాలతో విత్తనాలు మొలకెత్తిన ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. సకాలంలో చినుకు పడకపోతే విత్తిన విత్తులు మురిగిపోవడం ఖాయంగా కనినిస్తోంది. మృగశిర కార్తె ప్రారంభంలోనే పలుప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురియడంతో విత్తనాలు వేశారు. ఓ వైపు వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నా వినలేదు. దుక్కులు దున్ని చాలా మంది రైతులు విత్తనాలు నాటుకునేందుకు సమాయత్తం అవుతున్నా తరుణంలో వర్షాలు లేకపోవడంతో రైతులు ఆకాశం వైపు ఆందోళనతో చూస్తున్నారు. ఇక మొలచిన మొక్కలను బతికించుకొనేందుకు రైతులు పడుతున్న బాధలు వర్ణణాతీతం. వర్షాదారంపైనే ఆధారపడిన రైతులు అష్టకష్టాలు పడుతన్నారు. తొలకరి వర్షాలకు వేసుకున్న విత్తనాలు మొలకెత్తి రైతుల్లో ఆశలు రేకిత్తిస్తుండగా, వర్షాలు ముఖం చాటేయడంతో మొలిచిన మొక్కలు ఎండ దాటికి కమిలిపోతున్నాయి. ఎండిపోతున్న మొక్కలను చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలాచోట్ల ఎక్కువ మంది రైతులు వాణిజ్య పంట అయిన పత్తి పంటనే సాగు చేస్తారు. వర్షాకాలం ప్రారంభంలోనే రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి ఖరీఫ్‌కు సిద్ధమయ్యారు.

# వర్షాకాలంలో ఇసుక కొరత రాకుండా చూడాలి

### ఇప్పటి నుంచి నిల్వలు సిద్దం చేసుకోవాలి

### అధికారలుతో సమిక్షలో సిఎం జగన్ సూచన

అమరావతి,జూన్23(ఆర్ఎన్ఎ): వర్షాకాలంలో పనుల కోసం ఇసుక కొరత రాకుండా నిల్వ చేయాలని సిఎం వైఎస్జగన్ అధికారులను ఆదేశించారు. నిర్దేశించుకున్న 70 లక్షల టన్నుల ఇసుకను వర్షాకాలంలో పనుల కోసం నిల్వచేయాలని సీఎం సూచించారు. వచ్చే రెండు వారాల్లో మాత్రమే మనకు అందుబాటులో ఉంటుంది. ఆ తర్వాత వర్షాలు కురుస్తాయి. రీచ్‌లు మునిగే అవకాశాలు ఉంటాయి. కావాల్సిన ఇసుకను ఇప్పటికే నిల్వచేసుకోవాలి. శ్రీకాకుళం 20 వేలు, తూర్పు గోదావరి 60 వేలు, పశ్చిమగోదావరి 35 వేల టన్నులు, కృష్ణా 50 వేల టన్నులు, గుంటూరు 40 వేల టన్నులు ప్రతి రోజూ ఇసుకను ఉత్పత్తి చేయాలని సీఎం పేర్కొన్నారు. అధికారులతో క్యాంపు కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఇసుక నిల్వలపై సమీక్షించారు. ఇప్పటికే 46.30 లక్షల మెట్రిక్ టన్నులు నిల్వచేశామని అధికారులు సీఎం వైఎస్ జగన్‌కు వివరించారు. రోజువారీ అవసరాలను తీరుస్తూనే.. వర్షాకాలంలో అవసరాల కోసం ఈ ఇసుకను నిల్వ చేశామని తెలిపారు. ఏమీ చేయకపోయినా.. ఏదోరకంగా వేలెత్తి చూపిస్తారని సిఎం అన్నారు. వర్షాలు కురిసేలోగా ఇసుకను నిల్వచేయాలని, ఈ ఇసుకే వచ్చే కాలంలో వినియోగపడుతుందన్నారు. థర్డ్ ఆర్డర్ నదుల నుంచి, వాగులనుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఉచితంగా తీసుకువెళడానికి సీఎం అనుమతించారని పంచాయతీ రాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాల కృష్ణ ద్వివేదీ తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేస్తామని ఆయన తెలిపారు. ఉపాధి హామీ కింద భారీగా పనులు కల్పించాలని కలెక్టర్లు దీనిపై దృష్టిపెట్టాలని సీఎం వైఎస్ జగన్ అన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్, అంగన్ వాడీ కేంద్రాల మీద పూర్తిగా ధ్యాస పెట్టాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. వీటి నిర్మాణాల కోసం స్థలాలను గుర్తించి, వాటిని సంబంధిత శాఖకు అప్పగించంచాలని, వెంటనే పనులు మొదలు పెడతారన్నారు. నిర్మాణాల విషయంలో ఆలస్యం చేయకూడదని.. ఇవన్నీ కూడా వచ్చే ఏడాది మార్చి 31లోగా నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 55వేల అంగన్‌వాడీలను నాడు- నేడు కింద అభివృద్ధి చేస్తునాం. భవనాలు ఉన్నచోట మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేస్తాం.సొంతంగా భవనాలు లేనిచోట కొత్తగా నిర్మాణాలు చేస్తాం. వీటికోసం స్థలాల సేకరించి.. వాటిని పంచాయతీరాజ్‌కు బదిలీచేయాలని సీఎం ఆదేశించారు. పచ్చదనం పెంపునకు 'జగనన్న పచ్చతోరణం' కింద 6 కోట్ల మొక్కల నాటాలని లక్ష్యమని సీఎం తెలిపారు. నాడు నేడు కింద, ఖాళీ స్థలాల్లో, ఇంటర్నల్ రోడ్లు, అప్రోచ్ రోడ్లు తదితర ప్రాంతాల్లో మొక్కల నాటే కార్యక్రమం, అలాగే ఇళ్లపట్టాలు ఇవ్వనున్న లే అవుట్స్‌లో కూడా బాగా మొక్కలు నాటాలని సీఎం ఆదేశించారు. ప్రతి ఇళ్లపట్టా లబ్దిదారునికీ నాలుగు మొక్కులు ఇవ్వాలని సీఎం సూచించారు. పట్టణ ప్రాంతాల్లో వార్డు క్లినిక్స్, వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్స్ పేరిట నిర్మాణం చేపట్టాలన్నారు. 2 కి.మీ పరిధిలో, కనీసం 15 నిమిషాల వ్యవధిలో నడుచుకుంటూ వెళ్లేదూరంలో వార్డు క్లినిక్స్ నిర్మాణం చేయాలని దీనికోసం స్థలాలను గుర్తించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇంకా ఎక్కడైనా స్కూళ్లలో పనులు మొదలుపెటకపోతే.. దాన్ని తీవ్రంగా చూడాల్సి ఉంది. ఆగస్టు 3న స్కూళ్లు ప్రారంభం అవుతున్నందున వెంటనే ఈపనులు పూర్తి చేయాలన్నారు. ఫర్నిచర్, ఫ్యాన్లు అన్నీ కూడా స్కూళ్లకు వస్తున్నాయి. పనులు పూర్తికాకపోతే ఇబ్బందికరంగా ఉంటుంది. స్కూళ్లు తెరిచేలోగా నాడు ? నేడు కింద పనులు పూర్తి కావాలి. కచ్చితంగా కలెక్టర్లు దీనిపై దృష్టిపెట్టాలి. అర్బన్ ప్రాంతాల్లో కాంపౌండ్ వాల్ లాంటి పనుల విషయంలో అక్కడక్కడా వెనకబాటు కనిపిస్తోంది. నాడు ? నేడుకు నిధుల కొరతలేదు. వెంటనే మున్సిపల్ కమిషనర్లతో సమన్వయం చేసుకుని ఈ స్కూళ్లలో పనులు పూర్తయ్యేలా చూడాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆది మూలపు సురేశ్, సిఎస్ నీలం సాహ్ని, డిజిపి గౌతం సవాంగ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా మొక్కలు నాటిన బీజేపీ పార్టీ జిల్లా దళిత మోర్చ అధ్యక్షుడు




వేములవాడ, జూన్ 23(నేటినిజం ప్రతినిధి)శ్యాం ప్రసాద్ ముఖర్జీ.భారతీయ జనసంఘ్ పార్టీ స్థాపకుడు, ఆ పార్టీ సంస్థాపక అధ్యక్షుడు, ఇప్పటి భారతీయ జనతా పార్టీకి మూల పురుషుడు. డా.శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా మంగళవారం వేములవాడ పట్టణంలో బిజెపి పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా దళిత మోర్చ అధ్యక్షుడు కుమ్మరి శంకర్ డాక్టర్ శ్రీ శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూల మాలావేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుమ్మరి శంకర్ మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రత కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుడు,సమైక్య భారత్ కోసం పోరాటం చేసిన మహోన్నత దేశభక్తుడు అని కొనియాడారు .ఆయన స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని కోరారు . రాష్ట్ర పిలుపు మేరకు 19వార్డుల్లో కుమ్మరి శంకర్ మొక్కలు నాటారు .ఈ కార్యక్రమంలో బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు

# పీడీసీ టీ10 క్రికెట్ టోర్నీకి శ్రీలంక నో

### -కరోనా నేపథ్యంలో ఆడేందుకు నిరాకకరణ

కొలంబో,జూన్23(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో మ్యాచ్‌లు లేక ఏదో ఒక టోర్నీ ఆడాలని ఉవ్విళ్లూరుతున్న శ్రీలంక క్రికెటర్లకు ఆ దేశ క్రికెట్ బోర్డు చేదువార్త వినిపించింది. దేశంలో త్వరలో ప్రారంభం కానున్న పీడీసీ టీ10 క్రికెట్ టోర్నీలో ఆడేందుకు బోర్డుతో కాంట్రాక్ట్ ఉన్న క్రికెటర్లను అనుమతించబోమని శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) ప్రకటించింది. అలాగే, పీడీసీ టీ10 టోర్నీని తాము ఆమోదించలేదని స్పష్టం చేసింది. ఎస్ఎల్‌సీతో కాంట్రాక్ట్ ఉన్న పలువురు ఈ టోర్నీలో ఆడుతున్నారంటూ ఇటీవల పలు పత్రికలు, టీవీల్లో వచ్చిన కథనాలనుద్దేశించి శ్రీలంక క్రికెట్ ఈ ప్రకటన విడుదల చేసింది.

కాగా, పీడీసీ టీ10 టోర్నీని ఈ నెల 25 నుంచి నిర్వహించేందుకు నిర్వాహకులు షెడ్యూల్ విడుదల చేశారు. మొత్తం ఎనిమిది జట్లు ఇందులో పాల్గొంటున్నాయి. సమాధి క్రికెట్ గ్రౌండ్‌లో 46 మ్యాచ్‌లు 12 రోజులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో అంతర్జాతీయ స్థాయిలో అనుభవమున్న ప్రముఖ క్రీడాకారులు పాల్గొంటున్నారని టోర్నీ నిర్వాహకులు తెలుపగా, పలు మీడియా సంస్థలు కొందరి పేర్లను ప్రచురించాయి.

# ఈ ఏడాది హజ్ యాత్ర ఉండదు : కేంద్ర మంత్రి ముక్తార్

న్యూఢిల్లీ : ప్రపంచ వ్యాప్తంగా రోజురోజుకు కరోనా వైరస్ ఉధృతి పెరుగుతోంది. ఇప్పటికే భారత్‌లోని కొన్ని రాష్ట్రాలు లాక్‌డౌన్‌ను కొనసాగిస్తున్నాయి. కొవిడ్ కేసులు విపరీతంగా పెరుతున్న క్రమంలో ఈ ఏడాది భారత్ నుంచి హజ్ యాత్ర ఉండదని కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ ప్రకటించారు. హజ్‌యాత్ర కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి డబ్బులు వెనక్కి ఇస్తామని ఆయన తెలిపారు.ఇప్పటి వరకు అనుమతి లభించిన వారు 2021లో దానిని వినియోగించుకోవచ్చని తెలిపారు. సౌది అరేబియలో కరోనా కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# కాల్వల పూడికతీత పనులు చేపట్టాలి : మంత్రి సింగిరెడ్డి




వనపర్తి,జూన్ 23: ఉపాధిహామీలో భాగంగా కాల్వల పూడికతీత పనులను చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వనపర్తి కలెక్టరేట్‌లో మంత్రి నేడు సమిక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ యాస్మిన్‌బాషా, జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను మంత్రి ఆవిష్కరించారు.అనంతరం మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పనుల్లో అధికారుల నిర్లక్ష్యంపై అంసతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని ప్రణాళికాబద్దంగా చేపట్టాలన్నారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో తెలంగాణ రాష్ట్రం అన్నపూర్ణగా మారిందని తెలిపారు. పట్టాదారు పాస్‌బుక్కు ఉన్న ప్రతి రైతుకు రైతుబంధు అందుతుందని మంత్రి పేర్కొన్నారు.

# నకిలీ పత్తివిత్తన రాకెట్‌ను పట్టుకున్న పోలీసులు

### 30లక్షల విలువైన 15 క్వింటాళ్ల పత్తి విత్తనాలు స్వాధీనం

నల్లగొండ,జూన్23(ఆర్ఎన్ఎ): నకిలీ విత్తనాల అమ్మకాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా పోలీసులు భారీ అంతర్ రాష్ట్ర నకిలీ విత్తనాల రాకెట్‌ను ఛేదించారు. ఇందుకు సంబంధించి 23 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 30లక్షల విలువైన 15 క్వింటాళ్ల పత్తి విత్తనాలను, వాటిని ప్యాక్ చేసే మెషినరీ సామగ్రిని, సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు సంబంధించిన పూర్తి వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో నల్లగొండ ఎస్పీ ఏ.వి.రంగనాథ్ మీడియాకు వెల్లడించారు. నల్లగొండ జిల్లా చండూర్ మండలంలోని కమ్మగూడెంలో నాలుగు పత్తి విత్తన ప్యాకెట్లు సరైన ప్యాకింగ్, లేబిల్ లేకుండా కనిపించారు. ఈ విషయం చండూర్ పోలీసుల దృష్టికి వెళ్లిది. అక్కడి నుంచి పోలీసులు విచారణ ప్రారంభిస్తే... అది తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ కు సంబంధం ఉన్న రాకెట్ గా తేలింది. దీంతో ఎస్పీ జిల్లా స్థాయిలోనే ఏఎస్పీ సతీష్ నేతృత్వంలో ఒక ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు.రంగంలోకి దిగిన పోలీసులు ఇందులో సంబంధం ఉన్న వారిని ఒక్కొక్కరికి అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో పలు పోలీసు స్టేషన్ల పరిధిలో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. ఈ మేరకు గద్వాల జోగులాంబ, నాగర్ కర్నూల్ జిల్లాలకు చెందిన పలువురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారిస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాలకు చెందిన మరికొందరి పాత్ర బయటపడింది. వారిని కూడా అరెస్ట్ చేశారు. నల్లగొండ జిల్లా పరిధిలోని గుర్రంపోడు, నకిరేకల్, శాలిగౌరారం, మునుగోడు, అడవిదేవులపల్లి మండలాలకు చెందిన మరికొందరి పాత్ర వెల్లడైంది. ఇలా మొత్తం 23 మందిని అరెస్ట్ చేశారు. వీరు అక్షర, ఇండిగో కంపెనీల పేరుతో వీటిని మార్కెట్లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఇంకా పలువురు పరారీలో ఉన్నట్లు చెప్పారు. వీరి పై పీడీ యాక్టు కేసు నమోదు చేస్తామని ఎస్పీ వివరించారు.

# చైనా ఘర్షణలో గాయపడిన సైనికులకు ఆర్మీ చీఫ్ పరామర్శ

లడక్,జూన్ 23:లఢక్‌కు వెళ్లిన భారత ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవాణే లేహ్‌లోని సైనిక దవాఖానను సందర్శించారు. గల్వాన్ లోయలో భారత్, చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన జవాన్లు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. ఆ జవాన్లను పరామర్శించిన నరవాణే, వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. వారిలో స్థైర్యం నింపే ప్రయత్నం చేశారు. రెండు రోజులపాటు లఢక్‌లో పర్యటించనున్న ఆర్మీ చీఫ్ జనరల్ నరవాణే, లేహ్ సైనిక కేంద్రంలోని 14 కార్స్ అధికారులతో సమీక్ష జరుపుతారు. సరిహద్దు ఘర్షణపై చైనా అధికారులతో జరుగుతున్న చర్చల పురోగతిని ఆయన అడిగి తెలుసుకుంటారు.

జూన్ 15-16 తేదీల్లో లఢక్‌లోని గల్వాన్ లోయలో భారత్, చైనా మధ్య జరిగిన ఘర్షణలో తెలంగాణకు చెందిన కర్నల్ సంతోష్ బాబుతోసహా 20 మంది జవాన్లు అమరులైన సంగతి తెలిసిందే. ఈ ఘర్షణలో సుమారు 70 మందికిపైగా జవాన్లు గాయపడ్డారు. ఈ ఘటన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి పెరిగాయి.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.